

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 30 | హైదరాబాద్ | శుక్రవారం | 17-07-2026 | పేజీలు: 08




## సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం..

సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో ఘటన

ఇస్లామిక్ సూక్తులు నేర్చుకోవాలంటూ హిందూ విద్యార్థికి హోంవర్క్

డైరీని గమనించి షాక్ కు గురైన తల్లిదండ్రులు

స్కూలు గుర్తింపు రద్దు చేయాలన్న రాంచందర్ రావు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

హైదరాబాద్ పాతబస్తీ పరిధిలోని సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అక్కడి 'సక్సెస్ స్కూల్'లో రెండో తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థికి... ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన 'కల్మా', 'సూరహ్ అల్‌ఫాతిహా' చదివి, నేర్చుకు రావాలంటూ ఉపాధ్యాయురాలు హోంవర్క్ ఇవ్వడం, స్కూల్ డైరీలో లిఖితపూర్వకంగా రాయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

బాలుడు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత డైరీని గమనించిన తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్న వయసులోనే విద్యార్థులపై ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం ఏంటని ఆగ్రహం మిగతా 3లో..

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో

# విద్యుత్ సంక్షోభం

11 జిల్లాల్లో ధర్నాలు.. సబ్‌స్టేషన్ల ముట్టడికి రైతులు

బొగ్గు నిల్వల కొరతే పవర్ కట్‌లకు కారణం: హరీష్ రావు

బొగ్గు, విద్యుత్, ఇసుకలో స్కామ్‌లు జరుగుతున్నాయన్న ఆరోపణ

అప్రకటిత కరెంట్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు

ప్రభుత్వానికి ముందుచూపు లేక రాష్ట్రం అంధకారంలోకి: హరీష్

రిజర్వాయర్లలో కేవలం 33 శాతం నీటి నిల్వలేనని ఆందోళన

ప్రతిపక్ష హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ

థర్మల్ ప్లాంట్లలో 6–7 రోజుల బొగ్గు నిల్వలు కూడా లేవు

విద్యుత్ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపణ




హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస ముందుచూపు లేకపోవడం వల్లే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తోందని మండిపడ్డారు. "ఒకప్పుడు కరెంట్ పోతే వార్త.. కానీ ఈ చేతకాని ప్రభుత్వ పాలనలో ఇప్పుడు కరెంట్ ఉంటేనే వార్తగా మారింది" అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగ్గా లేకపోవడంతో ఇప్పటికే 11 జిల్లాల్లో భారీ ఎత్తున ధర్నాలు జరిగాయని, చాలా చోట్ల రైతులు ఆగ్రహంతో సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారని గుర్తుచేశారు. అప్రకటిత కరెంట్ కోతలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**బొగ్గు కొరత, విచ్చలవిడి స్కామ్‌లు!**

రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కనీసం 6 నుంచి 7 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు కూడా లేకపోవడం వల్లే ఈ తీవ్రమైన విద్యుత్ సమస్య తలెత్తిందని హరీష్ రావు ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, కనీస నిర్వహణ లోపం వల్ల బొగ్గు నిల్వలు లేక విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా కుంటుపడిందని స్పష్టం చేశారు. "ఈ ప్రభుత్వంలో బొగ్గు లో స్కాం, పవర్ లో స్కాం, సాండ్ (ఇసుక) లో స్కామ్‌లు విచ్చలవిడిగా బయటపడుతున్నాయి" అని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో కేవలం 33 శాతం మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంగా తాము నిరంతరం ప్రభుత్వాన్ని నిద్రలేపుతున్నా, పాలకుల్లో కనీస ఉలుకూ పలుకూ లేదని ధ్వజమెత్తారు.

**7,180 మెగావాట్ల సామర్థ్యం ఉన్నా.. ఉత్పత్తి సగమే**

తెలంగాణ రాష్ట్రంలో సరిపడా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉందని హరీష్ రావు మిగతా 2లో..

## పూరీ జగన్నాథ రథయాత్రలో విషాదం..

తొక్కిసలాటలో ఒకరు మృతి, 100 మందికిపైగా గాయాలు

లక్షలాది మంది భక్తుల రద్దీతో రథయాత్రలో అపశ్రుతి

తొక్కిసలాటలో కటక్‌కు చెందిన అనిల్ దాస్ మృతి

100 మందికిపైగా భక్తులకు గాయాలు.. ఆస్పత్రుల్లో చికిత్స

సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు, అత్యవసర వైద్య బృందాలు

ఘటనపై అధికారులు ఆరా.. రద్దీ నియంత్రణకు అదనపు భద్రత

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ఒడిశాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలో జరుగుతున్న శ్రీ జగన్నాథ రథయాత్రలో విషాద ఘటన చోటుచేసుకుంది. లక్షలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొనేందుకు తరలిరావడంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో కటక్‌కు చెందిన అనిల్ దాస్ అనే భక్తుడు మృతిచెందగా, 100 మందికిపైగా భక్తులు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

సమాచారం అందుకున్న పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు, వైద్య సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరికి స్వల్ప గాయాలు కాగా, మరికొందరి పరిస్థితిపై వైద్యులు నిఘా ఉంచినట్లు తెలుస్తోంది.

రథయాత్ర సందర్భంగా శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి రథాలను దర్శించేందుకు వేలాదిగా భక్తులు ఒకేచోట చేరడంతో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుని తొక్కిసలాటకు దారితీసినట్లు ప్రాథమిక సమాచారం. ఘటన జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో భక్తులను క్రమబద్ధంగా బయటకు తరలించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై పోలీసులు, జిల్లా యంత్రాంగం విచారణ ప్రారంభించారు. తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులు, మిగతా 2లో..



## హిందూ సంస్కృతిపై దాడి చేస్తే ఊరుకోం

ప్రైవేట్ స్కూల్ వివాదంపై కేంద్ర మంత్రి బండి నిప్పులు

మజ్లిస్, పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం

సైదాబాద్ స్కూల్ హోంవర్క్ వివాదంపై ధ్వజం

హిందూ విద్యార్థులపై కల్మా బలవంతపు రుద్దుడు దుర్మార్గం

సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌పై తక్షణమే కఠిన చర్యలకు డిమాండ్

సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపు

సెక్యులర్ సంఘాల మౌనంపై బండి సంజయ్ సూటి ప్రశ్న

ఇలాంటి ఘటనలపై ఎందుకు నోరు మెదపడం లేదని ఆగ్రహం



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర పరిధిలోని సైదాబాద్ ప్రాంతంలో ఉన్న సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో చోటుచేసుకున్న ఒక ఉదంతం తీవ్ర వివాదాస్పదంగా మారింది. స్కూల్‌లో చదువుతున్న మిగతా 2లో..

## సీతారామ ప్రాజెక్టుపై భట్టి కీలక ప్రకటన..

# ఇక వెనక్కి తగ్గేది లేదు..

సీతారామ ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు

రీడిజైన్‌పై కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తాం

ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు.

**వైఎస్సార్ హయాంలోనే పునాది.. కేసీఆర్ పాలనలో వ్యయం పెంపు**

గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మిగతా 2లో..



## కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిపోయింది

బీఆర్ఎస్ పాలనపై ఉత్తమ్ విమర్శలు

రీ-డిజైనింగ్ పేరుతో భారీ వ్యయం

కాళేశ్వరం కూలడానికి కమిషన్లే కారణం

బ్యారేజీల మరమ్మతులకు ప్రభుత్వం సిద్ధం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను సందర్శించిన అనంతరం గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 2023లో తాను ఇరిగేషన్ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి శాఖపై లోతుగా సమీక్షలు జరిపానని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అద్భుతాల ప్రచారమంతా పచ్చి అబద్ధమని తేలిపోయిందన్నారు. గత పాలకుల హయాంలో జలవనరుల శాఖలో అడ్డూఅదుపూ లేకుండా జరిగిన వందల కోట్ల అక్రమాలు, మిగతా 2లో..



## అడవుల రక్షణతోనే మానవ మనుగడ

పాతకాలపు అలవాట్లు నేడు బంగారంతో సమానం

మంత్రి దనసరి సీతక్క పిలుపు!

గొనెపల్లిలో మహిళా సంఘాలకు తేనెటీగల పెంపకం శిక్షణ

ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించిన మంత్రి సీతక్క

ప్రకృతి ప్రసాదించిన ఫలాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్లాస్టిక్ ప్లేట్ల వాడకంతో పెరుగుతున్న క్యాన్సర్ మహమ్మారి

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

వడ్డీ లేని రూ.10 లక్షల రుణాల పంపిణీపై మంత్రి వెల్లడి

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సరికొత్త ఉపాధి మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా గురువారం నాడు ములుగు జిల్లా తాడ్వాయి మండలం గొనెపల్లి గ్రామంలో ఒక ముఖ్యమైన శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, ఇందిరా మహిళాశక్తి జీవనోపాధుల పథకం కింద మహిళా సంఘాల సభ్యులకు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల మిగతా 2లో..





## పూరీ జగన్నాథ రథయాత్రలో విషాదం..

**మొదటిపేజీ తరువాయి**

భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా ఆరా తీస్తున్నారు. భక్తులు ఆందోళనకు గురికాకుండా అధికారుల సూచనలు పాటించాలని, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం..

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తం చేస్తూ బంధువులు, స్థానికులతో కలిసి నేరుగా స్కూల్‌కు వెళ్లి యాజమాన్యాన్ని సూటిగా నిలదీశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. బాధితులు వెంటనే సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం వెలుగులోకి రాగానే అలర్ట్ అయిన సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. ఇది సదరు టీచర్ వ్యక్తిగతంగా చేసిన పొరపాటుగా భావిస్తున్నామని పేర్కొంది. ఈ వివాదానికి కారణమైన ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను తక్షణమే విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో తమ విద్యాసంస్థల్లో ఆమెకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని, పాఠశాలలో ఇలాంటి మతపరమైన బోధనలకు తావు లేదని స్పష్టం చేసింది.

ఈ ఉదంతంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అత్యంత తీవ్రంగా స్పందించారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు' అనే ప్రకటనల వల్లే ఇలాంటి శక్తులకు ప్రోత్సాహం లభిస్తోందని మండిపడ్డారు. స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ... చిన్నారిపై మతపరమైన ఒత్తిడి తీసుకురావడం ఘోరమని, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యుత్ సంక్షోభం

**మొదటిపేజీ తరువాయి**



గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రంలో 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఈ ప్రభుత్వ చేతకానితనం వల్ల కేవలం 3,190 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నడిపే వారికి కనీస అవగాహన, సోయి లేదని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇంధన శాఖను పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కనీస బాధ్యత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలకు కనీసం 8 గంటల విద్యుత్‌ను కూడా అందించలేకపోతున్నారని విమర్శించారు.


## ఓటరు నమోదుపై అప్రమత్తంగా ఉండాలి

- **'సర్' ప్రక్రియలో బారసా శ్రేణులు చురుకుగా పాల్గొనాలి**
- **పట్టణంలోని వార్డుల్లో పరిశీలన నిర్వహించిన జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్**

**వనపర్తి,జూలై 16 (ప్రజాక్షేత్రం):**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్)లో భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొని ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పిలుపునిచ్చారు.

వనపర్తి పట్టణంలోని 27, 28, 29, 30వ వార్డుల్లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఓటరిని ప్రత్యక్షంగా కలిసి 'సర్' ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత రాష్ట్ర సమితి బూత్ స్థాయి ప్రతినిధులు ఓటరు నమోదు దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా పూరించేందుకు ప్రజలకు సహకరించాలని ఆయన కోరారు. దరఖాస్తుల స్వీకరణ నుంచి నమోదు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొంటూనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు వాకిటి శ్రీధర్ సూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిపోయింది

**మొదటిపేజీ తరువాయి**

అవినీతి విచారణలో బయటపడ్డాయని ఆయన వెల్లడించారు.

**రీ-డిజైనింగ్ దోపిడీ.. లక్ష కోట్లు పెట్టినా సున్నా**

గత ప్రభుత్వం సగం పూర్తయిన ప్రాజెక్టులను సైతం కేవలం రీడిజైనింగ్ పేరుతో మార్చేసి అంచనా వ్యయాలను ఇష్టారాజ్యంగా పెంచిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. పదేళ్ల సుదీర్ఘ కాలంలో కనీసం దేవాదుల ప్రాజెక్టు పనులను కూడా పూర్తి చేయలేకపోయారని, సీతారామ ప్రాజెక్టు కోసం రూ. 8,000 కోట్లు ఖర్చు చేసినా ఆశించిన ఫలితం రాలేదని మండిపడ్డారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అని డబ్బా కొట్టుకుంటూ దాదాపు లక్ష కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు నిట్టనిలువునా కూలిపోయింది. కేవలం కమిషన్ల కోసం కక్కుర్తి పడి నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చింది. అన్నారం బ్యారేజీని ఒకచోట డిజైన్ చేసి, దానికి పూర్తి భిన్నంగా మరొక చోట నిర్మించారు. ఫలితంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం అసలు వినియోగానికే పనికిరాదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) తేల్చి చెప్పింది" అని మంత్రి స్పష్టం చేశారు.

**రిపేర్లు పూర్తి చేస్తాం..**

**తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు**

కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల నుండి ఒక్క చుక్క నీటిని కూడా తీసుకోకుండానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాష్ట్రంలో అత్యధికంగా వరి పంట పండేలా చేసి చూపించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. ప్రకృతి సిద్ధంగా వచ్చిన కరువును చూపిస్తూ బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం తాము పూర్తిగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందడుగు వేస్తున్నామని వివరించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను పునరావాసం (రిహబిలిటేషన్) పరిధిలోకి తెచ్చి, త్వరితగతిన రిపేర్లు పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన ఘోరమైన తప్పులన్నింటినీ సరిదిద్ది, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.



## హిందూ సంస్కృతిపై దాడి చేస్తే ఊరుకోం

**మొదటిపేజీ తరువాయి**

హిందూ విద్యార్థులకు కల్మా, సూరహ్ ఫతేహా చదవాలంటూ ఉపాధ్యాయులు హోంవర్క్ ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు బరితెగించి బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. పసిపిల్లలపై ఇలాంటి ధార్మికాంశాలను హుకుం జారీ చేస్తూ బలవంతంగా రుద్దాలని చూడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన ధ్వజమెత్తారు.

ఈ వివాదాస్పద ఘటనకు కారణమైన సైదాబాద్ సక్సెస్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం, బాధ్యులపై విద్యాశాఖ మరియు పోలీస్ శాఖ తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ గట్టిగా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తాజాగా ఒక అధికారిక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యను నేర్పించాల్సింది పోయి, ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం సమాజానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఈ దుశ్చర్యను కులమతాలకు అతీతంగా సమాజంలోని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తన ప్రకటనలో పిలుపునిచ్చారు.

నగరంలో ఇంత పెద్ద వివాదం జరుగుతున్నా, హిందూ విద్యార్థుల హక్కులకు భంగం వాటిల్లుతున్నా రాష్ట్రంలోని మేధావులు, సెక్యులర్ సంఘాలు మౌనంగా ఉండటాన్ని కేంద్ర మంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. నిరంతరం సెక్యులరిజం గురించి మాట్లాడే సదరు సంఘాల నాయకులు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని సూటిగా ప్రశ్నించారు. వేరే విషయాల్లో చిన్న చిన్న సంఘటనలు జరిగినా పెద్ద ఎత్తున స్పందించే వారు, హిందూ సంస్కృతిపై ఇంత బహిరంగంగా దాడి జరుగుతుంటే ఎందుకు మౌన వ్రతం వహించారో సమాజానికి సమాధానం చెప్పాలని బండి సంజయ్ నిలదీశారు.

రాష్ట్రంలో రానున్న రోజుల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారబోతున్నాయని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి రావడం పక్కా అని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికార బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాష్ట్రంలోని పాఠశాలల్లో చదువుకునే హిందూ విద్యార్థులందరికీ బొట్టు పెట్టుకోవడాన్ని తప్పనిసరి చేస్తామని సంచలన ప్రకటన చేశారు. విద్యార్థులు తమ సాంప్రదాయాలను గౌరవించేలా చూస్తామన్నారు. విద్యాసంస్థల్లో హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పటిష్టంగా పాటించేలా అన్ని రకాల కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఇటీవల నగరంలో జరిగిన ఆటో డ్రైవర్ భరత్ ఉదంతాన్ని కూడా బండి సంజయ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆటో డ్రైవర్ భరత్‌ను కొందరు పోలీసులు మరియు మజ్లిస్ పార్టీ నాయకులు కలిసి తీవ్రమైన వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. ఒక సామాన్య ఆటో డ్రైవర్‌ను టార్గెట్ చేసి వేధించిన సదరు పోలీసు అధికారులు, మజ్లిస్ నాయకులపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి కఠినంగా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు తాము ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు.

నగరంలో జరుగుతున్న ఇలాంటి వరుస అక్రమాలు, ఏకపక్ష వేధింపుల ఘటనలపై ప్రభుత్వ యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించడం సరికాదని బండి సంజయ్ హితవు పలికారు. అధికార పక్షం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇలాంటి వాటిని నిర్లక్ష్యం చేస్తే, ఈ తరహా ఉదంతాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజధాని నుంచి తెలంగాణ అంతటా విస్తరించే ప్రమాదం ఉందని తీవ్రంగా హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించకపోతే రాష్ట్రంలో అశాంతి రేగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్ భరత్ వ్యవహారంలో చట్టం తన పక్షపాత బుద్ధిని చూపిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. అసలు భరత్ రాసిన రాతల్లో చట్ట వ్యతిరేకమైనది ఏముందని ఆయన ప్రశ్నించారు. నగరంలో ఎన్నో ఆటోలపై, బహిరంగ గోడలపై హిందువుల మనోభావాలను కించపరిచేలా ఉర్దూ భాషలో రాతలు రాసుకున్న వారిపై పోలీసులు ఎందుకు సుమోటోగా కేసులు నమోదు చేయడం లేదని నిలదీశారు. మజ్లిస్ నాయకులకు ఒక న్యాయం, సామాన్యుడైన భరత్‌కు మరొక న్యాయమా అని, చట్టం అందరికీ సమానంగా వర్తించదా అని పోలీసుల తీరును తప్పుపట్టారు.

హిందూ సమాజం యొక్క ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కాపాడటానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని బండి సంజయ్ స్పష్టం చేశారు. సైదాబాద్ స్కూల్ ఘటన కేవలం ఒక పాఠశాల సమస్య కాదని, ఇది హిందూ సంస్కృతిపై జరుగుతున్న క్రమబద్ధమైన దాడి అని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు నైతిక విలువల కంటే ఇలాంటి పద్ధతులు నేర్పడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గేదే లేదని, బాధ్యులపై చట్టపరమైన విచారణ జరిపించి స్కూల్‌పై తగిన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకువస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ తన ప్రకటన ద్వారా భరోసా ఇచ్చారు.

## మురుగు కాలవపై వంతెన లేక స్థానిక ప్రజలు కు నిత్య నరకం

- **ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది**

**మొయినాబాద్ జూలై 16(ప్రజాక్షేత్రం):**



మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద మంగళారం గ్రామంలో నివసిస్తున్న కుమ్మరి సాయన్న నీటి కాలువపై వంతెన లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న సాయన్న ఆయన నివాసానికి వెళ్లే మార్గంలో మురుగునీటి కాలువ ఉండటంతో ప్రతిరోజు ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగించాల్సి వస్తుందని సాయన్న తెలిపారు. వృద్ధులు మహిళలు చిన్నారులు ఈ మార్గంలో ప్రయాణించడం మరింత ప్రమాదకరంగా మారిందన్నారు. పెద్ద మంగళారం గ్రామం లోని 17 మరియు 18వ వార్డులో పరిధిలో ఉండటంతో ఎవరు పట్టించుకోవడం లేదు అని సాయన్న ఆరోపించారు. జరగరాని ప్రమాదం జరుగుతే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు అని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మురుగు కాల్వపై రాకపోకలకు శాశ్వత నిర్మించి ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## సీతారామ ప్రాజెక్టుపై భట్టి కీలక ప్రకటన..

# ఇక వెనక్కి తగ్గేది లేదు..

**మొదటిపేజీ తరువాయి**

4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీడిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీడిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు.

**వెనక్కి తగ్గేదే లేదు..**

**ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**

గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## అడవుల రక్షణతోనే మానవ మనుగడ

**మొదటిపేజీ తరువాయి**



పెంపకంపై ప్రత్యేక శిక్షణను ఆమె అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అడవులతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరూ అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఇప్పపువ్వు, మోదిగాకులు, అడవి తేనె మానవ ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని చెప్పారు. మన పూర్వీకుల పాతకాలపు నాటి జీవన విధానం మరియు ఆహార అలవాట్లు నేటి రోజుల్లో బంగారంతో సమానమని కొనియాడారు. ఆధునిక కాలంలో ప్లాస్టిక్ ప్లేట్లలో వేడి ఆహారం తీసుకోవడం వల్లే ప్రజలు క్యాన్సర్ వంటి భయంకరమైన రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాంప్రదాయ మోదిగాకుల్లో భోజనం చేయడం వల్ల శరీరానికి ఎంతో ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు.

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు కేవలం ఇంటి పనులకే పరిమితం కాకుండా, సొంతంగా వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి వడ్డీ లేని రూ.10 లక్షల వరకు భారీ రుణాలను ప్రభుత్వం అందిస్తోందని వెల్లడించారు. ఈ విధంగా పొందిన బ్యాంకు రుణాలను మహిళలు వృథా చేయకుండా, సరైన ఉపాధి మార్గాల్లో పెట్టుబడిగా పెట్టి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.

మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని చెప్పడానికి మంత్రి సీతక్క ఒక అద్భుతమైన ఉదాహరణను పంచుకున్నారు. గత కొద్ది నెలల క్రితం ఎస్ఎస్ తాడ్వాయి మండలం పరిధిలోని కొండపర్తి గ్రామంలో కేవలం రూ.50 వేల స్వల్ప పెట్టుబడితో మహిళలు ఒక ఇప్పపువ్వు లడ్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. అడవిలో దొరికే ఇప్పపువ్వుతో వారు చేసిన లడ్లకు మార్కెట్లో మంచి ఆదరణ లభించిందన్నారు. ఆ చిన్న వ్యాపారంతో నేడు మహిళా సంఘం సభ్యురాళ్లు ఏకంగా రూ.5 లక్షల వరకు భారీ ఆదాయాన్ని ఆర్జించి రికార్డు సృష్టించారని మంత్రి అభినందించారు.

కొండపర్తి గ్రామం తరహాలోనే గొనెపల్లి గ్రామంలోని మహిళలు కూడా తేనెటీగల పెంపకం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని మంత్రి సూచించారు. ఇందుకోసం హంబుల్ బీ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ శాస్త్రీయ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలందరూ పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో నాణ్యమైన తేనెను సేకరించడం ద్వారా మార్కెట్లో మంచి ధర లభిస్తుందని, తద్వారా ప్రతి కుటుంబానికి స్థిరమైన ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు.

వ్యవసాయ రంగం మరియు ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై కూడా మంత్రి సీతక్క ఈ వేదికగా స్పందించారు. ప్రస్తుత సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రైతులు కేవలం సాంప్రదాయ వరి పంటపైనే ఆధారపడకుండా, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని హితవు పలికారు. నీటి ఎద్దడిని తట్టుకునే పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాల నుంచి గట్టెక్కవచ్చని రైతులకు సూచించారు.

రైతు సోదరులు తమ పొలాల్లో కందులు, పెసర్లు, మొక్కజొన్న వంటి అల్పావధి మరియు చిరుధాన్యాల పంటలను సాగు చేసుకోవాలని మంత్రి కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లో వీటికి విపరీతమైన ఆదరణ పెరుగుతోందని, రానున్న రోజుల్లో ఈ ప్రత్యామ్నాయ పంటలకు దేశవ్యాప్తంగా భారీ డిమాండ్ మరియు గిట్టుబాటు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారులు కూడా గ్రామాల్లో పర్యటించి రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై తగిన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ శిక్షణా కార్యక్రమం జిల్లా యంత్రాంగం ఉమ్మడి ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడింది. ఈ వేదికపై ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్‌వో వికాస్ మీనా, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీవో) నవీన్ వత్సల్ టొప్పోలు పాల్గొని మహిళలకు దిశానిర్దేశం చేశారు. వీరితో పాటు అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, హంబుల్ బీ సంస్థ ప్రతినిధులు మరియు స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యవసాయమే జీవన విధానం..

- రైతే బలం
- తోటలు,పశుసంపదను పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- దొడగుంటపల్లి శివారులోని వ్యవసాయ క్షేత్రంలో గడిపిన సమయం..
- గోవులకు స్వయంగా అరటిపండ్లు తినిపించిన ఎమ్మెల్యే





**వనపర్తి,జూలై 16 (ప్రజాక్షేత్రం):**

ప్రజా ప్రతినిధిగా నిత్యం అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో బిజీగా ఉండే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వ్యవసాయంపై తనకున్న మక్కువను మరోసారి చాటిచెప్పారు. గురువారం ఉదయం దొడగుంటపల్లి శివారులోని తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి తోటలు, పంటలు, పశుసంపదను పరిశీలించారు. రైతు కుటుంబంలో పెరిగిన వ్యక్తిగా వ్యవసాయాన్ని కేవలం వృత్తిగా కాకుండా జీవన విధానంగా భావిస్తానని ఆయన తన ఆచరణ ద్వారా తెలియజేశారు.

**తోటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

వ్యవసాయ క్షేత్రంలో ఉన్న కొబ్బరి, మామిడి, జామ తోటలను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. మొక్కల పెరుగుదల, వాటి సంరక్షణ, నీటి వసతి, ఎరువుల వినియోగం, తోటల నిర్వహణ తదితర అంశాలపై ఆసక్తిగా ఆరా తీశారు. ప్రతి మొక్క ఆరోగ్యంగా పెరిగేలా తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తూ మరింత మెరుగైన నిర్వహణకు అవసరమైన సూచనలు చేశారు. ప్రకృతి సహజ పద్ధతులతో సాగు చేస్తేనే మంచి దిగుబడులతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయని పేర్కొన్నారు.

**పశుసంపదపైనా అదే శ్రద్ధ**

అనంతరం వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్న గోవుల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే వాటికి స్వయంగా అరటిపండ్లు తినిపించారు. గోవుల ఆరోగ్యం, మేత, సంరక్షణ, పాల ఉత్పత్తి తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. పశుసంపద రైతు కుటుంబాలకు అదనపు ఆదాయ వనరుగా నిలుస్తుందని, వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే రైతుల ఆర్థిక స్థితి మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు.

**వ్యవసాయంపై తగ్గని అభిమానం**

ప్రస్తుతం వనపర్తి ఎమ్మెల్యేగా ప్రజాసేవలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ, వృత్తిరీత్యా ప్రముఖ కాంట్రాక్టర్ అయినప్పటికీ వ్యవసాయంపై తనకున్న ప్రేమ ఏమాత్రం తగ్గలేదని ఆయన మరోసారి నిరూపించారు. ప్రజా కార్యక్రమాల మధ్య సమయం దొరికినప్పుడల్లా వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తూ పంటల పరిస్థితి, తోటల నిర్వహణ, పశుసంపద సంరక్షణను స్వయంగా పర్యవేక్షించడం ఆయన దినచర్యలో భాగమైందని సన్నిహితులు తెలిపారు.

**రైతు కష్టాలు తెలిసిన నాయకుడు**

రైతు కుటుంబ విలువలను ఎప్పటికీ మరువని ఎమ్మెల్యే మేఘారెడ్డి వ్యవసాయాన్ని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలాధారంగా భావిస్తుంటారు. రైతులు ఎదుర్కొనే ఇబ్బందులు, సాగులోని సవాళ్లు ప్రత్యక్షంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో తరచూ వ్యవసాయ క్షేత్రంలో గడుపుతుంటారు. పంటల సంరక్షణ, నీటి నిర్వహణ, పశుపోషణ, ఆధునిక సాగు పద్ధతులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**ప్రజాసేవతో పాటు ప్రకృతి సేవ**

ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మరోవైపు వ్యవసాయాన్ని, పశుసంపదను సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజాసేవను బాధ్యతగా, వ్యవసాయాన్ని జీవన విధానంగా భావిస్తూ రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, పశుసంపద పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందుతున్నారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, వ్యవసాయ ప్రగతే రాష్ట్రాభివృద్ధికి పునాది అన్న నమ్మకంతో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి రైతాంగానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- అధికారులను పురోగతిపై అడిగి తెలుసుకున్న మంత్రులు వెంట ఎమ్మెల్యే కోరం కనకయ్య

**పినపాక జూలై 16 (ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిశీలించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు శాసనసభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్శనలో భాగంగా ఇల్లందు ఎమ్మెల్యే శ్రీ కోరం కనకయ్య కూడా మంత్రులతో కలిసి ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించారు.ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, నిర్దేశిత గడువులో పనుల పూర్తి వంటి అంశాలపై అధికారులు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రులు సూచించారు.సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతాంగానికి విశేష ప్రయోజనం చేకూరుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కొంపల్లి ఫ్లైఓవర్ కింద అడ్డా కూలీ దారుణ హత్య

- మద్యం మత్తు..ప్రాణం తీసిన ఘర్షణ?

**కుత్బుల్లాపూర్,జూలై 16(ప్రజాక్షేత్రం):**

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంపల్లి ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతం కింద ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే పేట్ బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు.

ప్రాథమిక విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మద్యం మత్తులో ఉన్న అడ్డా కూలీల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని, అది తీవ్ర ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో నర్సింహులు అనే కూలీపై దాడి జరగడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు నర్సింహులు (36) అడ్డాపై పని చేసే దినసరి కూలీగా పోలీసులు గుర్తించారు. హత్యకు గల పూర్తి కారణాలు, ఘర్షణలో పాల్గొన్న వ్యక్తుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



## 7.వ రోజు కొనసాగుతున్న బహదూర్ గూడ రైతుల భూ పోరాటం..

- మాకు న్యాయం జరిగే వరకు రైతుల పోరాటం ఆగదు.
- బహదూర్ గూడ గ్రామ రైతులకు పట్టా పాసు బుక్కులు ఇవ్వాలి..

**శంషాబాద్ జులై16(ప్రజాక్షేత్రం):**

బహదూర్ గూడ రైతు భూ పోరాట సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైతుల భూ పోరాటం 7.వ రోజుకు కొనసాగుతుందని బహదూర్ గూడ రైతులు ఉన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... బహదూర్ గూడ రైతులకు న్యాయం జరిగేంతవరకు రైతుల భూ పోరాటం ఆగదని రైతులు అన్నారు. సుమారు 1400 ఎకరాల భూమిలో 650 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం తీవ్ర అన్యాయం అని రైతులు అన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు ఈ పోరాటం ఆగదని హెచ్చరించారు. టెర్మినల్, మెట్రో రైలు, ఇతర ప్రాజెక్టుల పేరుతో సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకోవడం ఏమాత్రం సమాజం కాదన్నారు. ప్రభుత్వం రైతులను ఒంటరిగా చేసి నిద్రించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని రైతులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బహదూర్ గూడ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## స్వదేశీకి అండగా యువత..

- ఆరోగ్యానికి ఆర్గానిక్ ఉత్పత్తులు
- ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి
- పలుస శంకర్ గౌడ్

**వనపర్తి,జూలై 16 (ప్రజాక్షేత్రం):**

స్వదేశీ వస్తువుల వినియోగాన్ని పెంచి, ఖాదీ ఉత్పత్తులు, సేంద్రియ ఆహారాలను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. వనపర్తి పట్టణంలో యువ పారిశ్రామికవేత్తలు శివరాజ్, నర్సింహ స్వామి, భానుప్రకాష్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన "స్వదేశీ మార్ట్" దుకాణాన్ని గురువారం సందర్శించిన ఆయన వారికి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురు చూడకుండా యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. ముగ్గురు యువకులు కలిసి స్వయం ఉపాధిని ఎంచుకుని "స్వదేశీ మార్ట్" ఏర్పాటు చేయడం ఆదర్శనీయమని కొనియాడారు. ఇలాంటి ప్రయత్నాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. దుకాణంలో ఖాదీ వస్త్రాలు, స్వదేశీ ఉత్పత్తులు, సేంద్రియ ఆహార పదార్థాలు, ఆర్గానిక్ ఆహార వస్తువులను అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. రసాయన రహిత ఆహార పదార్థాల వినియోగం ఆరోగ్య పరిరక్షణకు ఎంతో మేలు చేస్తుందని, ప్రజలు వీలైనంత వరకు స్వదేశీ, సేంద్రియ ఉత్పత్తులనే కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. "స్వదేశీని కొందాం.. ఆరోగ్యంగా ఉందాం" అనే సందేశాన్ని ప్రతి కుటుంబం ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త గంధం నాగరాజు, శ్రీనివాస్, యువ పారిశ్రామికవేత్తలు శివరాజ్, నర్సింహ స్వామి, భానుప్రకాష్, పాత్రికేయుడు శేఖర్ తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు. స్వదేశీ మార్ట్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



## వర్షాలు కురవాలని శివుడికి గంగాజలంతో అభిషేకం

**కోటగిరి,జులై 16(ప్రజాక్షేత్రం):**



వానకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని, వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని కోటగిరి మండల కేంద్రంలోని ముక్తేశ్వర శివాలయంలో ప్రత్యేకంగా మూడు రోజుల పాటు జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు వేద పండితులు రాజేశ్వర్ జోషి, శివాలయం ప్రధాన అర్చకులు దత్తాత్రి కులకర్ణి అన్నారు.కోటగిరి మండల కేంద్రంలోని బ్రాహ్మణ గల్లి లోని ముక్తేశ్వర శివాలయంలో గ్రామస్తుల సహకారంతో భక్తులు, మహిళా భక్తులు శివాలయంలో గురువారం ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గంగాజలాలతో శివుడికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగిరి వేద పండితులు రాజేశ్వర్ జోషి మాట్లాడుతూ ప్రతి ప్రాణికి నీళ్లు ఆధారం కాబట్టి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆ పరమేశ్వరుడిని కోరుతూ ఈ మూడు రోజుల పాటు జలాభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి జ్యోషితో పాటు శివాలయం అర్చకులు దత్తాత్రేయ కులకర్ణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, కోటగిరి సొసైటీ చైర్మన్ కూచి సిద్ధూ, నూకల రమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామప్రాజెక్ట్ నీళ్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకే ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్

**భద్రాచలం,జూలై 16(ప్రజాక్షేత్రం):**

ఖమ్మం జిల్లా మంత్రులు సీతారామప్రాజెక్ట్ నీళ్లు ఖమ్మం జిల్లాకు తరలించుటకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. అశ్వాపురం వస్తున్న 4 గురు మంత్రులు సీతారామప్రాజెక్ట్ సందర్శించడానికి వస్తున్న సందర్భంగా రైతుల తరుపున నిరసన తెలియజేయుటకు మణుగూరు బయలుదేరివస్తున్న, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేసి అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును హరించి ప్రజాస్వామ్యాని తుంగలో తొక్కుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రశ్నిస్తున్నా ప్రజల గొంతు పోలీసుల ద్వారా అణచివేయలని ప్రయత్నం చేస్తుంది ఈ ప్రభుత్వం. ప్రజలకు నష్టం చేసే ఏ కార్యక్రమం చేసిన ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తాం. ఇప్పటికైన సీతారామ ప్రాజెక్ట్ నీళ్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు మాత్రమేఉపయోగించాలని తాతారావు డిమాండ్ చేశారు.



## నెల రోజులుగా నీటి సమస్య రోడ్డెక్కిన విద్యార్థునిలు

- గాంధీనగర్ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థుల నీటి రోదన
- ఒక్కొక్కరికి పది రూపాయలు ఇస్తేనే మోటార్ రిపేర్ చేపిస్తామన్న హెచ్ఎం
- ఇబ్బందులు తాళలేక ధర్నాకు దిగిన విద్యార్థులు
- చెరవాణిలో మంత్రి సీతక్క తో మాట్లాడిన తరువాత నిరసన నిరసన విరమణ

**కొత్తగూడ జూలై 16 (ప్రజాక్షేత్రం):**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్ లోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు మాకు నీటి సమస్య తీర్చాలంటూ రోడ్డు ఎక్కి ధర్నాకు దిగారు.

గత నెల రోజులుగా నీటి సమస్యతో అతలాకుతలం అవుతున్నామని, ఉదయం లేవగానే కనీసం వాష్ రూమ్ కి పోదామంటే కూడా నీరు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ నిరసన చేపట్టారు. కనీసం బాత్రూంలో శుభ్రం చేయడానికి కూడా నీరు లేక మమ్ములను ఇబ్బందులకు గురిచేస్తున్న గురుకుల పాఠశాల యజమాన్యం. ఒక్కో విద్యార్థి పది రూపాయలు చెల్లిస్తే రిపేర్ చేపిస్తామంటున్న హెచ్ఎం మాటలతో విసిగిపోయిన విద్యార్థులు ధర్నాకు దిగారు విద్యార్థులను వేధిస్తున్న ఉపాధ్యాయులు వెంటనే అధికారులు మాకు నీటి వసతి కల్పించాలంటూ నినాదాలు చేస్తూ ధర్నాకు దిగి ఉదయం అంతా విద్యార్థులు ధర్నాలో పాల్గొన్నారు. సోషల్ మీడియాలోఈ విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క విద్యార్థులతో ఫోన్లో మాట్లాడి 12 గంటల్లో మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వగానే విద్యార్థులు తమ ధర్నాను విరమించుకున్నారు.



## ఎస్ఐఆర్2026లో ప్రజలు భాగస్వాములు కావాలి: డా. ఎస్. మల్లారెడ్డి

- **ఓటరు జాబితా సవరణపై బీజేపీ అవగాహన కార్యక్రమం**
- **దుండిగల్‌లో ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు మార్గదర్శనం**

**కుత్బుల్లాపూర్,జూలై 16 (ప్రజాక్షేత్రం):**

భారత్ ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్-2026 కార్యక్రమంలో భాగంగా గురువారం 296 దుండిగల్ డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఇంచార్జ్ డా. ఎస్. మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఎస్ఐఆర్ కన్వీనర్ శివాజీ రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. విఘ్నేష్ చారి హాజరై, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలకు అవసరమైన మార్గదర్శకాలు, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో ఆకుల మల్లేష్, గొట్టిముక్కల పాండురంగనాథ్, శేఖర చారి, శ్రీను నాయక్, ఎస్టీఈ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎం. వెంకటేష్ నాయక్, సర్కిల్ ప్రధాన కార్యదర్శి తురాయి భాను గౌడ్, యువ మోర్చా నాయకులు ఆకుల విజయ్,తలారి రాజ్‌కుమార్,నామాల శ్రీకాంత్, యశ్వంత్ పటేల్,ఏలూరి శ్రీధర్ గౌడ్,మైలారం శ్రీకాంత్,ఏలూరి విష్ణు,సీహెచ్ కిరణ్,సాయి శిరగల,నాగేంద్ర బాబు, రాజ్‌కుమార్ నాయక్,అనిల్ తలారి,రామారం మధు, శ్రీనివాస్,దేవరాజ్,ప్రతాప్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.




## హుడా కాలనీలో మసీదుకు స్థలం కేటాయించాలి

- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం వినతి**

**శంషాబాద్ జులై16 (ప్రజాక్షేత్రం ):**

శంషాబాద్ జోన్ పరిధిలోని హుడా కాలనీలో గత 30 సంవత్సరాలుగా హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు సామరస్య వాతావరణంలో కలిసి జీవిస్తున్నారని, అదే స్ఫూర్తితో ముస్లిం సోదరుల ప్రార్థనల కోసం మసీదు నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని స్థానిక ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం ప్రతినిధులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు.కాలనీలో ఇప్పటి వరకు మసీదు లేకపోవడంతో, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ప్రతిరోజూ నమాజ్ నిర్వహించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వివరించారు. మసీదు నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తీగల శివకుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ...హుడా కాలనీలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో జీవిస్తున్నారని, "మనమంతా అన్నదమ్ములమే" అనే భావనతో ప్రతి ఒక్కరూ కలిసిమెలసి ఉండాలని అన్నారు.ముస్లిం సోదరుల న్యాయమైన విజ్ఞప్తికి తన పూర్తి మద్దతు ఉంటుందని, వారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హుడా కాలనీలో ఇప్పటికే హిందూ సోదరుల కోసం హనుమాన్ ఆలయం, క్రైస్తవ సోదరుల కోసం ప్రార్థనా మందిరం ఉన్న నేపథ్యంలో, ముస్లిం సోదరుల ప్రార్థనల కోసం కూడా మసీదు ఏర్పాటుకు తగిన స్థలాన్ని కేటాయించాలని వినతిలో కోరారు.ఈ కార్యక్రమంలో హుడా కాలనీ ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ముస్లిం పెద్దలు,యువకులు, స్థానిక ప్రజలు,మైనారిటీ నాయకులు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కష్టానికి తగిన ఫలితం దక్కితేనే పనికి గౌరవం

**నిజామాబాద్,జూలై 16(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో బోధన్ మున్సిపాలిటీ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను రావాల్సిన పిఆర్సి వేతన బకాయి వెంటనే చెల్లించాలని అలాగే ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రతి శిలా మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం బోధన్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల ఆరోనెల గా పెండింగ్ లో ఉన్న పిఆర్సి వేతనాల బకాయి తక్షణమే విడుదల చేయాలని విధుల్లో నిర్వహణ అవసరమైన పనిముట్లు అందించాలని పిఎస్ ఈఎస్ఐ సంబంధిత సంబంధిత సమస్యలు పరిశించాలని కోరారు అలాగే సేవలో ఉండంగా మరణించిన లేదా పదవి విరమణ పొందిన కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు ధర్నా అనంతరం యూనియన్ ప్రతినిధులు మున్సిపాల్ కమిషనర్ ను కలిసి తమ సమస్యలను వివరించారు మూడు నెలల పిఆర్సి బకాయి తక్షణమే విడుదల చేస్తామని మరణించిన కార్మికులకు లేదా పదవి విరమణ పొందిన కార్మికుల వారసులను ఉద్యోగాలలోని తీసుకునే అంశంపై హైదరాబాద్లోని ఉనంత అధికారులతో చర్చించి ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు బి మల్లేష్ కార్మికుల ప్రతినిధులు కే గంగమని బి సాయమ్మ ఎం అబ్బయ్య సరోజన నాగమణి అబ్బవ్వ పోసాని రాణి తదితరులు పాల్గొన్నారు.



# అట్రాసిటీ కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు

- **దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి**
- **ఆరేళ్లుగా ఒక్క కేసులోనూ నేరారోపణ లేకపోవడంపై ఎంపీ మల్లు రవి ఆగ్రహం**
- **ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెరుగుతున్న నమోదుకు అనుగుణంగా వసతి గృహాలు పెంచాలి**
- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,జూలై 16 (ప్రజాక్షేత్రం):**

ఎస్సీ,ఎస్టీలపై జరిగే అత్యాచారాలు,దౌర్జన్యాల కేసుల్లో ఆలస్యం లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు అనంతరం త్వరితగతిన అభియోగపత్రాలు దాఖలు చేయాలని నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి అధికారులను ఆదేశించారు. దోషులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2018 నుంచి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, బాధితులకు చెల్లించిన పరిహారం, విచారణ స్థితిపై కేసుల వారీగా సమీక్ష నిర్వహించారు. 202526లో విచారణలో ఉన్న 12 కేసులపై జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డి వివరాలు వెల్లడించారు.

**ఆరేళ్లుగా నేరారోపణలు లేవా?**

సమీక్షలో ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ 2020 నుంచి 2026 వరకు జిల్లాలో ఒక్క అట్రాసిటీ కేసులోనూ నేరారోపణ జరగకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులు ఎవరో స్పష్టం చేయాలని అధికారులను ప్రశ్నించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యానికి తావులేకుండా ఆధారాలు సేకరించి అభియోగపత్రాలు దాఖలు చేయాలని ఆదేశించారు. తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోవడం సమాజానికి మంచిది కాదన్నారు.

**ఆలస్యంపై విస్మయం**

2020లో నమోదైన ఓ కేసు ఇప్పటికీ విచారణ దశకే పరిమితమై, ట్రయల్ తేదీ కూడా ఖరారు కాకపోవడంపై ఎంపీ విస్మయం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పురోగతి వివరాలు తెలుసుకున్నారు. సమావేశానికి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరు కాకపోవడం కూడా చర్చనీయాంశమైంది.

**భూ ఆక్రమణ కేసులకు ప్రాధాన్యం**

ఎస్సీ, ఎస్టీల భూముల ఆక్రమణ, భూ వివాదాలకు సంబంధించిన అట్రాసిటీ కేసులను అత్యంత ప్రాధాన్యంతో విచారించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఎంపీ ఆదేశించారు. ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవాన్ని సమర్థంగా నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు బాధితుల్లో భరోసా పెంచాలని సూచించారు.



**సంక్షేమ పథకాలపై ఆరా**

వివిధ సంక్షేమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల పురోగతిపై ఎంపీ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మెస్, ఇతర నిర్వహణ చార్జీలు ప్రభుత్వం పెంచినా వసతి గృహాల్లో వార్డెన్ల పర్యవేక్షణ సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

**వసతి గృహాలు పెంచాలి**

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు సైకిళ్లు తదితర సహాయం అందించడంతో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిందన్నారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు వసతి గృహాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు.

**పరిహార నిధులు విడుదల చేయాలి**

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో దోషులకు శిక్షలు పడేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బాధితులకు చెల్లించాల్సిన సుమారు రూ.75 లక్షల పరిహారం నిధులు విడుదల కాకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయని, వాటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. పౌర హక్కుల దినోత్సవాన్ని మరింత సమర్థంగా నిర్వహించి ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచాలని సూచించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈవో యాదయ్య, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రాంజీరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాజుద్దీన్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఓ ఉమాదేవి, కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.





# ఆకాశం వైపు అన్నదాతల చూపు..!

- **వర్షాలు లేక ఎండుముఖం పట్టిన పంటలు**
- **దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు**
- **వర్షాల కోసం వెయ్యికళ్లతో ఎదురుచూపు**
- **బోరు నీటితో మొక్కలకు ప్రాణం**
- **పెట్టుబడి మునిగిపోతుందనే రైతుల ఆందోళన**
- **24 వేల ఎకరాల్లో సాగు... వర్షాలే కీలకం**
- **తేమ లేక కుంగిపోతున్న పత్తి, కంది పంటలు**
- **దిక్కుతోచని స్థితిలో పెద్దేముల్ అన్నదాతలు**

**పెద్దేముల్,జూలై 16 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.సీజన్ ప్రారంభంలో అక్కడక్కడ కురిసిన చిరుజల్లులను నమ్ముకొని రైతులు అప్పులు చేసి విత్తనాలు కొనుగోలు చేసి సాగు పనులు చేపట్టారు.అయితే విత్తిన తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అనేక పొలాల్లో విత్తనాలు మొలకెత్తలేదు. మొలకెత్తిన చోట కూడా తేమ లేక మొక్కలు ఎండుముఖం పట్టడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.ప్రస్తుతం మండలంలోని రైతులందరి చూపు ఆకాశం వైపే నిలిచింది. "వరుణ దేవుడు ఎప్పుడు కరుణిస్తాడో... ఎప్పుడు వర్షాలు కురుస్తాయో..." అనే ఆందోళన ప్రతి రైతు ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది.

**మండలంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం**

2026-27 ఖరీఫ్ సీజన్‌లో పెద్దేముల్ మండలంలో రైతులు సుమారు 24 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు.

పత్తి - 12,500 ఎకరాలు
కంది - 8,500 ఎకరాలు
వరి - 800 ఎకరాలు
మొక్కజొన్న - 210 ఎకరాలు
చెరుకు - 1,800 ఎకరాలు

ఈ పంటలన్నీ ప్రస్తుతం వర్షాల కోసం ఎదురు చూస్తున్నాయి.

**బోరు నీరే ఆధారం**

వర్షాలు లేకపోవడంతో కొంతమంది రైతులు బోరు బావుల నీటిని మోటార్లు, డ్రిప్ సిస్టమ్‌ల ద్వారా అందిస్తూ మొక్కలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.అయితే భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పట్టడంతో రైతులకు ఈ అవకాశం లేకపోవడం మరో సమస్యగా మారింది.

**పెట్టుబడి మొత్తం ప్రమాదంలో**

ఈ సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు విత్తనాలు, ఎరువులు, దున్నకం, కూలీల ఖర్చుల కోసం భారీగా పెట్టుబడులు పెట్టారు.కానీ సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో ఆ పెట్టుబడి మొత్తం ప్రమాదంలో పడింది.ఇప్పటికే కొన్ని పొలాల్లో రైతులు మళ్లీ విత్తాల్సిన పరిస్థితి నెలకొంది.

**పంటలపై తీవ్ర ప్రభావం**

తేమ లేకపోవడంతో పత్తి, కంది వంటి ప్రధాన పంటల్లో ఎదుగుదల మందగించింది.కొన్ని ప్రాంతాల్లో మొక్కలు పూర్తిగా ఎండిపోతుండగా, మరికొన్ని చోట్ల పసుపు రంగులోకి మారుతున్నాయి.రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వరుణ దేవుడే తమని ఆదుకోవాలి**

గత కొన్ని రోజులుగా మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో మంచి వర్షాలు కురిస్తేనే పంటలు గట్టెక్కే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వరుణ దేవుడు కరుణించాలని పెద్దేముల్ మండల రైతన్నలు కోరుకొంటున్నారు. మరోవైపు ఇప్పటికే ఆయా గ్రామాల్లో రైతన్నలు ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు.మరి ఇప్పటికైనా వరుణ దేవుడు కరుణిస్తాడో ! రైతులను నట్టేట ముంచేస్తాడో వేచి చూడాలి.

# మానేరు బ్లాస్టింగ్‌తో వణుకుతున్న కాలనీలు..!

- **రివర్‌ఫ్రంట్ పనుల పేరిట భారీ పేలుళ్లు**
- **ఇండ్లకు పగుళ్లు, పొలాల్లోకి ఎగిరిపడుతున్న రాళ్లు డ్యామ్ భద్రతపై ఆందోళన**

**కరీంనగర్,జూలై 16 (ప్రజాక్షేత్రం):**

కరీంనగర్‌లో మానేరు రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న రాతిబండల బ్లాస్టింగ్ స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న పేలుళ్లతో సమీపంలోని కాలనీలు దద్దరిల్లుతున్నాయని, భూకంపం వచ్చినట్లుగా ఇండ్లు కంపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. భారీ స్థాయిలో జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ, హౌసింగ్ బోర్డు కాలనీ, బైపాస్ రోడ్డు, అలుగునూర్ పరిసర ప్రాంతాల్లోని ఇళ్ల గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు.నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన మానేరు రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులో ప్రస్తుతం రెండో దశ పనులు కొనసాగుతున్నాయి. క్రూయిజ్ బోట్లు, స్పీడ్ బోట్లు, వాటర్ స్పోర్ట్స్ నిర్వహణ కోసం స్పిల్‌వే గేట్ల నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు నీటి మట్టాన్ని పెంచే పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో నీటిలో ఉన్న భారీ రాతిబండలను తొలగించేందుకు బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఇప్పటికే తొలి దశలోనే రాళ్ల తొలగింపుకు సుమారు రూ.30 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం.

అయితే ప్రస్తుతం స్పిల్‌వే గేట్లు-అలుగునూర్ బ్రిడ్జి మధ్య కొనసాగుతున్న పేలుళ్లు తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెద్దమ్మవాడ, ఎస్సీ కాలనీ, చౌరస్తా ప్రాంతాలతో పాటు బైపాస్ రోడ్డు పరిసరాల్లోని ఇళ్ల గోడలు, స్లాబులు బీటలు వారడం, కిటికీలు, వెంటిలేటర్ల అద్దాలు పగిలిపోవడం జరుగుతోందని చెబుతున్నారు. అంతేకాకుండా పేలుళ్ల సమయంలో భారీ రాతి ముక్కలు చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ పొలాల్లోకి ఎగిరి పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పొలాల్లో పనిచేసే కూలీలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు. గతంలో కేబుల్ బ్రిడ్జి సమీపంలో నిర్వహించిన బ్లాస్టింగ్ వల్ల కూడా హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇళ్లకు పగుళ్లు వచ్చిన విషయాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు.

**డ్యామ్ భద్రతపై పెరుగుతున్న సందేహాలు**

ఎల్ఎండీ స్పిల్‌వే గేట్ల సమీపంలోనే బ్లాస్టింగ్ జరుగుతుండటంతో డ్యామ్ భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జనావాసాలు, డ్యామ్‌కు సమీపంలో నియంత్రిత పేలుళ్లు నిర్వహించాల్సి ఉండగా, అధిక శక్తి గల పేలుడు పదార్థాలు ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పేలుళ్ల ప్రభావం డ్యామ్ కట్ట, గేట్లపై కూడా పడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

ఇంకా మానేరు గేట్ల దిగువన భారీ రాతిబండలు తొలగించాల్సి ఉండటంతో పనులు పూర్తయ్యేలోపు మరెన్ని ఇళ్లకు నష్టం వాటిల్లుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదులు వస్తున్నప్పటికీ సంబంధిత ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్ భద్రతా ప్రమాణాల అమలుపై తగిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.





# అదనపు డబ్బులు వసూలు చేస్తే కాంట్రాక్టు రద్దు

- సేవల్లో పారదర్శకత లేకపోతే కఠిన చర్యలు తప్పవు
- భక్తుల నుంచి అధిక ధరల వసూళ్లపై ఈవో తనిఖీలు

**వేములవాడ, జూలై 16(ప్రజాక్షేత్రం):**

భక్తుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కాంట్రాక్టును రద్దు చేస్తామని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి స్పష్టం చేశారు. ఇటీవల కళ్యాణకట్టలో భక్తుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా క్షేత్రస్థాయికి చేరుకున్న ఈవో, తలనీలాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో నేరుగా మాట్లాడి సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎవరైనా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారా లేదా అనే అంశాలపై ఆరా తీశారు.

**అదనపు వసూళ్లపై ప్రత్యేక నిఘా**

తనిఖీల్లో భాగంగా కళ్యాణకట్టలో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణుల వివరాలను వీడియో రికార్డింగ్ ద్వారా సేకరించిన ఈవో, వారికి వేతనాలు అందుతున్నాయా లేదా అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు పలు కీలక ఆదేశాలు జారీ చేస్తూ, ప్రతి ఉద్యోగికి యూనిఫాం, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని, కార్మికులకు వేతనాలు ఆలస్యం కాకుండా చెల్లించాలని సూచించారు. టికెట్ ధర 50 రూపాయలు మాత్రమేనని, అంతకు మించి చెల్లించవద్దని తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని, మైక్ ద్వారా నిరంతరం



ప్రకటనలు చేయాలని ఆదేశించారు. కళ్యాణకట్ట మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉండాలని, నగదు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించడానికి ఇద్దరు సిబ్బందిని నియమించాలని అధికారులకు సూచించారు. ఎవరైనా అదనపు డబ్బులు వసూలు చేసినట్లు రుజువైతే సంబంధిత కాంట్రాక్టును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని ఆమె హెచ్చరించారు. భక్తులు అక్రమ వసూళ్లను గమనిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.



## జై భారత్ రమణమూర్తి పై దాడి చేసిన మతోన్మాది కశ్యప్ రెడ్డి ని తక్షణమే అరెస్టు చేయాలి

- కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్

**యాలాల జూలై 16(ప్రజాక్షేత్రం):**

జై భారత్, హిందుస్ ఫర్ ప్లూరాలిటీ ఈక్వాలిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ విహారం రమణమూర్తి పై దాడి చేసిన ఆర్ఎస్ఎస్ మతోన్మాది కశ్యప్ రెడ్డి ని తక్షణమే అరెస్టు చేయాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో గురువారం యాలాల మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఈ యొక్క దాడిని ప్రజలు ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని ఆయన కోరారు. బి ఆర్కే టివి డిబేట్ లైవ్ లో చెప్పుతో దాడి చేయడం దుర్మార్గం అన్నారు. శ్రీకృష్ణ భగవానుడి తలస్థానంలో మోడీ తల పెట్టడం అమానుషం, హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దు అని అలా పెట్టిన ఫోటో చూపిస్తూ రమణ మూర్తి మాట్లాడటమే నేరమైందా? అని ప్రశ్నించారు. ఈ ఆర్ ఎస్ ఎస్, బిజెపి వాళ్లకు దేవుడు కంటే మోడీ ఎక్కువయ్యాడా? దేవుడిని ఎందుకు అవమానించారు? ఇది తప్పని మాట్లాడినందుకు దాడి చేశారని చెప్పారు. సమాజంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, హిందూ, ముస్లిం మత సామరస్యాన్ని అహర్నిశలు పనిచేస్తున్న రమణమూర్తిని సైద్ధాంతికంగా ఎదుర్కోలేకనే కుట్రపూరితంగా, ముందస్తు ప్రణాళిక ప్రకారమే దాడి చేశాడని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు ప్రశ్నించిన ప్రతి వారిపై భౌతికతను పాల్పడుతున్నారని చెప్పారు. ఈ దాడులను సహించబోమన్నారు ప్రజలు ప్రజాస్వామిక వాధలందరూ దీని ఖండించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ గౌడ్, గోపాల్, లాలప్ప, హన్మప్ప , రాజు నాయక్ తదితరులు.

## పైప్‌లైన్ లీక్.. వృథాగా పారుతున్న తాగునీరు

- కలెక్టర్ నివాసం సమీపంలో ప్రధాన పైప్‌లైన్
- లీకేజీ..పట్టించుకోని అధికారులు
- మరమ్మతుల్లో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**కరీంనగర్,జూలై 16 (ప్రజాక్షేత్రం):**




ఒకవైపు నీటి నిల్వలు రోజురోజుకూ తగ్గిపోతుండగా.. మరోవైపు నగరం నడిఒడ్డున విలువైన తాగునీరు కళ్లముందే వృథాగా పారుతోంది. కరీంనగర్ జిల్లా కలెక్టర్ నివాసానికి సమీపంలోని తెలంగాణ స్తూపం వద్ద ప్రధాన మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోజులుగా నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. భారీగా లీకవుతున్న నీరు కాలువలా పారుతుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన పైప్‌లైన్ దెబ్బతినడంతో నిరంతరంగా నీరు బయటకు వస్తున్నా, సంబంధిత అధికారులు ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడం పై స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం వేల లీటర్ల తాగునీరు వృథా అవుతుండగా, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ప్రజలు చెబుతున్నారు. నీటి కొరతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు, ఇలాంటి లీకేజీలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. లీకేజీతో రోడ్డంతా తడిసి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు జారిపడే ప్రమాదం కూడా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కళ్లముందే విలువైన మంచినీరు వృథా అవుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖ వెంటనే స్పందించి లీకేజీని శాశ్వతంగా నివారించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పైప్‌లైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## కాటేదాన్ డివిజన్ పరిధిలోని టాటా నగర్ లో వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర.

- ప్రత్యేక పూజలు చేసిన కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్.

**శంషాబాద్ జులై 16(ప్రజాక్షేత్రం):**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి కాటేదాన్ డివిజన్ టాటా నగర్ లో శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న 'శ్రీ జగన్నాథ రథయాత్ర' సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదములు తీసుకున్న కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ..జగన్నాథ రథయాత్ర సందర్భంగా భక్తుల కోలాహలం ,హరేకృష్ణ నామస్మరణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో,భక్తుల కీర్తనలు,ఆధ్యాత్మిక ప్రవచనాలు,సంకీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి అని అన్నారు.స్వామివారికి మహాహారతి సమర్పించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కాటేదాన్ డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షులు ఉప్పల్ శీను,కిలారి వెంకటరమణ,భీమ,రాయుడు,నరేష్,వీరస్వామి,మోహన్,రిషి,గణేష్,సుధామా,బాపిబాబు,నీళ్లు సిద్ధూ,రామ్, పింటూ,దిలీప్,పింటు,పెద్ద ఎత్తున ఒరిస్సాకు చెందిన జగన్నాథ స్వామి భక్తులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి మహిళా సర్పంచ్‌ల శిక్షణకు శ్వేత సూర్యకాంత్ ఎంపిక

**కోటగిరి,జులై 16(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండలం లోని ఎత్తోండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి అధికారికంగా ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా నుండి ఇద్దరికి మాత్రమే ఈ శిక్షణలో పాల్గొనే అవకాశం దక్కగా అందులో కోటగిరి మండలం ఎత్తోండ సర్పంచ్ ఎంపిక కావటం విశేషం.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణి

**సంస్థాన్ నారాయణపురం జులై 16(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం గ్రామంలో మన ప్రియతమ నేత మునుగోడు అభివృద్ధి ప్రదాత స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేయించడం జరిగింది. ఈ చెక్కులను మల్లారెడ్డిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు నర్రి మల్లేష్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులు 60,000/ గంట వెంకటేష్, 60,000/ జంగిలి సుధాకర్, 29,000తోటకూరి పాండు చెక్కులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నర్రి ఎట్టయ్య, సీనియర్ నాయకుల జినకల మారయ్య, యువ నాయకులు నర్రి లింగస్వామి ఆరోతేజ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు, బద్దుల పరుశురాం, మాచర్ల వినయ్ కుమార్, వార్డు సభ్యులు సిరిపంగి అండాలుకృష్ణ, బాతరాజు లాలు ప్రసాద్, సిరిపంగి మీనయ్య, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు నర్రి ఐలయ్య, సీనియర్ నాయకులు జినుకల జనార్ధన్, నర్రి స్వామి, పందుల మహేష్, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు నర్రి రాజు, గుత్తా వీరారెడ్డి, కడ్తాల సాయిలు, సిరిపంగి పెద్దులు, నర్రి యాదయ్య, బద్దుల మల్లేష్, చిల్లర శంకరయ్య, బద్దుల శ్రీశైలం, బద్దుల రాజు, బద్దుల కొమరయ్య, చిరగొని యాదగిరి, బత్తుల స్వామి, బద్దుల వెంకటేష్, గంట వెంకటేష్, తోటకూరి శంకరయ్య, ఏచూరి ఆకాష్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్

**చౌటుప్పల్,జూలై 16(ప్రజాక్షేత్రం):**

మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తనయుడు, సుశీ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ ఎండీ కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, శంషాబాద్ విమానాశ్రయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ పురపాలక సంఘం వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, యువజన కాంగ్రెస్ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు అబ్బనబోయిన రాము యాదవ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డి ఆయురారోగ్యాలతో, విజయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లెంకలపల్లి ఉప సర్పంచ్ మెతరి శంకర్, దాడి యశ్వంత్ రెడ్డి, పున్న మహేష్ తదితరులు పాల్గొని కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## బోనాల నిధుల్లో జల్‌పల్లికి మొండిచేయి.. వెంటనే నిధులు విడుదల చేయాలి: బీజేపీ

**మహేశ్వరం జూలై 16(ప్రజాక్షేత్రం):**

ఆషాఢ బోనాల జాతర నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలోని దేవాలయాల అభివృద్ధి పనుల్లో శంషాబాద్ జోన్, జల్‌పల్లి సర్కిల్‌కు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీజేపీ నాయకులు పెరమోని నరేష్ యాదవ్, గుర్జని గణేష్ గౌడ్, ఎండీ నయీమ్ అడ్వకేట్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బోనాల ఉత్సవాల కోసం సుమారు 3,000 దేవాలయాల అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించినప్పటికీ, జల్‌పల్లి సర్కిల్‌లోని ఆలయాలను అధికారులు పూర్తిగా విస్మరించారని విమర్శించారు. చార్మినార్, రాజేంద్రనగర్ జోన్లలో ఇప్పటికే పనులు ప్రారంభమైనా శంషాబాద్ జోన్‌కు నిధులు కేటాయించకపోవడం వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. జల్‌పల్లి, మామిడిపల్లి, శ్రీరామ్ కాలనీ, పహాడిషరీఫ్, కొత్తపేట్, ఎర్రకుంట తదితర ప్రాంతాల దేవాలయాల వద్ద యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించి, వెంటనే నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భక్తులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



## పేద విద్యార్థులను చదువులకు దూరం చేయడమే రేవంత్ సర్కార్ కుట్ర

- పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి – ఎస్ఎఫ్ఐ

**చౌటుప్పల్, జూలై 16(ప్రజాక్షేత్రం):**

ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ సమావేశం నేడు నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేయాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10,500 కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నాయని, ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే టీసీ, మెమోలు, డిగ్రీ సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు ఒత్తిడి చేయడం దుర్మార్గమని అన్నారు. దీనివల్ల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అవకాశాలు కూడా విద్యార్థులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యను బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఒకవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం, మరోవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలు అవలంబించడం విద్యార్థి వ్యతిరేక చర్యలేనని అన్నారు. విద్యను హక్కుగా కాకుండా భారంగా మార్చే విధానాలను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ విడుదల చేసి, ఫీజులు చెల్లించలేదనే పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు నిరాకరిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు దాసరి ప్రకాష్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మండల ఉపాధ్యక్షులు ఇరిగి వరుణ్ తేజ్ మండల నాయకులు మల్లేష్, అరవింద్, సతీష్, నిఖిల్, మనీ తదితరులు పాల్గొన్నారు.



# అంకిరెడ్డిగూడెం సర్పంచ్‌పై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదు

- సీసీ రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలి డీఎల్పీఓ ప్రతాప్ నాయక్

**చౌటుప్పల్, జూలై 16(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్పై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని జిల్లా స్థానిక పంచాయతీ అధికారి (డీఎల్పీఓ) ప్రతాప్ నాయక్ స్పష్టం చేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో డీఎల్పీఓ ప్రతాప్ నాయక్ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించి ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. విచారణ అనంతరం సర్పంచ్‌పై చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, అవి అవాస్తవమని స్పష్టం చేశారు.అనంతరం సీఎస్ఆర్ నిధుల ద్వారా దివీస్ సంస్థ సౌజన్యంతో రూ.98 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామ అభివృద్ధికి అత్యంత కీలకమైన ఈ పనులకు ఎవరూ ఆటంకాలు కల్పించకుండా సహకరించాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో 20 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థల యజమానులు తమ స్థలాలకు సంబంధించిన ప్రహరీలు, అరుగులు, ర్యాంపులు లేదా ఇతర నిర్మాణాలు గ్రామపంచాయతీ రికార్డుల ప్రకారం కేటాయించిన స్థలం కంటే ఎక్కువగా ప్రభుత్వ రోడ్డును ఆక్రమించి ఉంటే, వారికి కార్యదర్శి ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. కొలతల ప్రకారం ఆక్రమణలు నిర్ధారణ అయితే వాటిని తప్పనిసరిగా తొలగిస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, 20 అడుగుల రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం ఇరువైపులా మిగిలిన ఖాళీ ప్రదేశాల్లో గ్రామపంచాయతీ నిధులతో పూర్తి స్థాయి రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అభివృద్ధికి అడ్డంకులు సృష్టించకుండా ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.



# ముదిరాజ్ కులబాంధవుల సమక్షంలో పెద్దమ్మ తల్లి దేవాలయ నిధుల ప్రొసీడింగ్స్ కాపీలు అందజేసిన ఎమ్మెల్యే రామారావు పటేల్

**నిర్మల్ జిల్లా జూలై 16(ప్రజాక్షేత్రం):**

ముదిరాజ్ కళ్యాణ మండపము టీన్ షెడ్ కోసం పది లక్షల రూపాయలు, మరియు దత్త మందిరం (కృష్ణ) మందిరం కోసం మరో పది లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రొసీడింగ్స్ కాపీలను కుల సంఘాల నేతలకు అందచేయడం జరిగింది. ఈ నిధులతో ఆయా నిర్మాణ పనులను వేగవంతం చేయనున్నారు. తమ సంఘాల భవనాలకు నిధులు మంజూరు కావడం పట్ల కుల సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ ప్రత్యేక చొరవతో పెద్దమ్మ తల్లి దేవాలయ అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ. 10 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రొసీడింగ్స్ కాపీలను శాసనసభ్యులు (ఎమ్మెల్యే) రామారావు పటేల్ ఈ రోజు ముదిరాజ్ సంఘ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించేలా కృషి చేసినందుకు గాను ముదిరాజ్ సంఘ సభ్యులు, కుల బాంధవులందరి తరపున ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘ ముఖ్య నేతలు మరియు భక్తులు పాల్గొన్నారు.



# సిద్దిపేటలో కాండిల్ ప్రదర్శన నిర్వహించిన ప్రజా సంఘాలు

- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

**సిద్దిపేట, జూలై 16(ప్రజాక్షేత్రం):**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న కాండిల్ ర్యాలీకి సంఘీభావంగా సిద్దిపేటలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో గురువారం కాండిల్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక కన్వీనర్ వంగల సంతోష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న లోపాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల ఉపాధ్యాయులు పాపయ్య, ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి మాట్లాడుతూ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో చోటుచేసుకుంటున్న అవకతవకల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, విద్యార్థుల్లో తీవ్ర మానసిక ఆందోళన నెలకొంటోందని అన్నారు. పారదర్శకమైన పరీక్షల నిర్వహణతో పాటు విద్యార్థుల హక్కులను పరిరక్షించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే ప్రజాస్వామ్య హక్కులు, విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న సోనమ్ వాంగ్‌చుక్‌కు దేశ ప్రజలు, ముఖ్యంగా విద్యార్థి యువత సంఘీభావం ప్రకటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ(విజృంభన) నాయకులు రాజేష్, విష్ణు, సోషల్ వర్కర్ రామచంద్ర రెడ్డి, శ్రీ వర్ధన్, డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



# రమణమూర్తి పై దాడిని ఖండించాలి

- - దాడికి పాల్పడ్డ మతోన్మాది కశ్యప్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలి
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహనీయులు విగ్రహాల ముందు ప్లే కార్డ్స్ నిరసన.

**సంగారెడ్డి జూలై 16(ప్రజాక్షేత్రం):**

సంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య దుర్గాప్రసాద్ లు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, బాబు జగ్జీవన్ రామ్ సమతా సంఘం జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, స్వేరో జిల్లా నాయకులు బి బి పేట్ రాజు లు మాట్లాడుతూ జై భారత్, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ & ఈక్వాలిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయవిహారం రమణమూర్తి గారిపై దాడి చేసిన మతోన్మాది కశ్యప్ రెడ్డి ని తక్షణమే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దాడిని ప్రజలు ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండించాలని అన్నారు మంగళవారం నాడు బి ఆర్ కే టివి డిబేట్ లైవ్ లో రమణ మూర్తి తమ సమయం వచ్చినప్పుడు లైవ్ డిబేట్లోని అంశంపై కొన్ని ఫోటోలు చూపిస్తూ మాట్లాడటం జరిగిందని సమాధానం చెప్పే ధైర్యం లేక, అవగాహన లేక మతోన్మాది కశ్యపరెడ్డి రమణమూర్తి పై చెప్పుతో దాడి చేశాడని అన్నారు శ్రీకృష్ణ భగవానుడి తల స్థానంలో మోడీ తల పెట్టడం అమానుషం, హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దు అని అలా పెట్టిన ఫోటో చూపిస్తూ రమణమూర్తి గారు మాట్లాడటమే నేరమయ్యిందా? అని ప్రశ్నించారు.ఈ ఆరెస్సెస్, బిజెపి వాళ్లకు దేవుడి కంటే మోడీ ఎక్కువయ్యాడా? దేవుడిని ఎందుకు అవమానించారు? ఇది తప్పని మాట్లాడినందుకు దాడి చేశారని చెప్పారు. సమాజంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, హిందూ, ముస్లిం మత



సామరస్యానికి అహర్నిశలు పని చేస్తున్న రమణమూర్తిని సైద్ధాంతికంగా ఎదుర్కోలేకనే కుట్రపూరితంగా, ముందస్తు ప్రణాళిక ప్రకారమే దాడి చేశాడనీ విమర్శించారు. మతోన్మాదులను ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు
ఈ దాడులను ప్రజలు ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలని అన్నారు కాశ్యప్ రెడ్డి ని వెంటనే అరెస్టు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జన జాగృతి సేన జిల్లా అధ్యక్షులు బంగారు కృష్ణ బిసిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దేవదాస్ సామాజిక ఉద్యమ నాయకులు బసవరాజ్ అనిల్ బౌద్ధ కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు శివకుమార్ జై భారత్ జిల్లా నాయకులు దప్పు ప్రభాకర్ మచ్చురి ప్రసాద్ మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గంగాపురం సుగుణయ్య మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**సంస్థాన్ నారాయణపురం, జులై 16(ప్రజాక్షేత్రం):**

గంగాపురం సుగుణయ్య మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గంగాపురం సుగుణయ్య ఇటీవల మరణం చెందడంతో వారి యొక్క సంతాప సభ కార్యక్రమాన్ని ఈ కార్యక్రమాన్ని నారాయణపురం శాఖ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి అధ్యక్షతన స్థానిక రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలోనే సుగుణయ్య సిపిఐ పార్టీ లో చేరి అనేక పోరాటాలు చేసి అదే విధంగా గ్రామంలో పేదలకు ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేసి సాధించారు. పార్టీలో క్రియాశీల పాత్ర పోషించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం పాటుపడిన వ్యక్తి అని పేర్కొన్నారు. సిపిఐ పార్టీ ఆవిర్భావం వారి స్వగృహంలో జరిగింది అన్నారు. నేహల్ దహన్ పహాడ్ పోరాటంలో ధర్మ బిక్షం ఆశయం కల్పించి పోరాటానికి భూతం ఇచ్చిన కుటుంబం వారిది అని ఎమ్మెల్సీ సత్యం అన్నారు. నేటితరం యువకులకు సుగుణయ్య ఆదర్శం ప్రాయుడని అని అన్నారు. దోపిడీ లేని పోరాటాలకు సిపిఐ పార్టీ ఆదర్శంగా నిలవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి, భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు వి. రత్నాకర్ రావు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్దె శ్రీనివాసు, పల్లె రవికుమార్, బచ్చన గోని గాలయ్య, నాగభూషణం, దుబ్బాక భాస్కర్, ఉప్పల లింగస్వామి, చిలువేరు అంజయ్య, దేశిడీ నరేందర్ రెడ్డి, సుర్గి యాదయ్య గౌడ్, రుద్ర రాములు, కలకొండ సంజీవ, జగన్, గంగాపురం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాలు జరిపితే కఠిన చర్యలు తప్పవు

**నిర్మల్ జిల్లా జూలై 16(ప్రజాక్షేత్రం):**

కుంటాల మండలం ఓబీ గ్రామానికి చెందిన ఒక పద్నాలుగేళ్ల మైనర్ బాలికకు కుటుంబ సభ్యులు పెళ్లి నిశ్చయించినట్లు జిల్లా అధికారులకు ముందస్తుగా నమ్మకమైన సమాచారం అందింది. దీనిపై తక్షణమే స్పందించిన జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం, స్థానిక పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం, మరియు పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఉమ్మడిగా అత్యవసరంగా సదరు గ్రామానికి చేరుకున్నారు. పెళ్లి ఏర్పాట్లలో ఉన్న బాలిక నివాసానికి వెళ్లి వివాహ ప్రయత్నాలను అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులకు నచ్చజెప్పిన అధికారులుఅనంతరం అధికారులు బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మరియు బంధువులతో ప్రత్యేకంగా సమావేశమై అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఇందుకు కారణమైన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అధికారుల నచ్చజెప్పడంతో స్పందించిన కుటుంబ సభ్యులు, బాలికకు పద్దెనిమిదేళ్లు నిండే వరకు పెళ్లి చేయబోమని అధికారుల సమక్షంలో రాతపూర్వకంగా అంగీకరించారు. దీంతో అధికారులు వివాహాన్ని పూర్తిగా నిలిపివేయించారు. ఎదుగుదలపై తీవ్ర ప్రభావంఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తక్కువ వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల బాలికల శారీరక, మానసిక, మరియు ఆరోగ్యపరమైన అభివృద్ధి పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల ఎదురయ్యే ప్రాణసంకట పరిస్థితులను వివరించారు. సమాజంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు.






# పారిశుధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

**నిర్మల్ జిల్లా జూలై 16(ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు క్షేత్రస్థాయిలో ఉన్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తప్పనిసరిగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషన్ సభ్యులు సూచించారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న సహాయం నేరుగా లబ్ధిదారులకు చేరినప్పుడే ఆయా పథకాల ఆశయం నెరవేరుతుందని వారు స్పష్టం చేశారు.పారిశుధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టివివిధ మున్సిపాలిటీల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశుధ్య కార్మికుల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి, వారికి అందాల్సిన చట్టబద్ధమైన సౌకర్యాలు మరియు ఆరోగ్య భద్రతను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలిమున్సిపాలిటీల్లో సుదీర్ఘకాలం సేవలందించి, 60 సంవత్సరాల వయసు పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.వయోపరిమితి తీరిన కార్మికుల కుటుంబ సభ్యులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కమిషన్ సభ్యులు సూచించారు. తద్వారా ఆయా కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# దాబాలో దళిత యువకులపై దాడి ఆరోపణలు

**నవాబుపేట్ జులై 16(ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రంలోని మైతాఫ్ఖాన్‌గూడలో ఉన్న కనకదుర్గ దాబాలో భోజనం చేసేందుకు వెళ్లిన ఇద్దరు దళిత యువకులపై దాబా యజమాని, అతని అనుచరులు దాడి చేశారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై గురువారం నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు సుదర్శన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి దాబాలో బిర్యానీ చల్లగా ఉందని, వేడిగా ఇవ్వాలని కోరగా దాబా యజమాని శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పవన్‌తో పాటు మరికొందరు తమపై దాడి చేశారని ఆరోపించారు. దాడి సమయంలో తన చేతులను వెనుకకు కట్టి కొట్టడంతో పాటు కులం పేరుతో దూషించి, చంపేస్తామని బెదిరించారని పేర్కొన్నారు. అనంతరం కారులో తీసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులకు సమాచారం ఇస్తామని గట్టిగా కేకలు వేయడంతో నవాబుపేట వద్ద వదిలేసి వెళ్లిపోయారని తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే సాయంత్రం వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పోలీస్‌స్టేషన్‌కు రాకపోవడంతో న్యాయం జరగకపోతే జిల్లా ఎస్పీని ఆశ్రయిస్తామని గ్రామస్తులు, ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్చరించారు.
ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, చిట్టిగిద్ద కిష్టయ్య మాట్లాడుతూ.. దళితులపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రత్నం, మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్, నింగి జాన్, నర్సింలు, గోపాల్, శ్రీనివాస్, ప్రభాకర్, జగన్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# ధర్మ సమాజ్ పార్టీలో చేరిన యువకులు

**వనపర్తి, జూలై 16(ప్రజాక్షేత్రం):**

గోపాల్ పేట్ మండలం బుద్ధారం గ్రామ యువకులు బహుజన్ సమాజ్ పార్టీనీ వీడి ధర్మ సమాజ్ పార్టీలో చేరారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ కండువా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు వీరపాగ రామక్రిష్ణ ఆధ్వర్యంలో డా. విశారదన్ మహారాజ్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు. అణగారిన వర్గాల కోసం అంబేద్కర్, కన్షిరామ్ సిద్ధాంతాల భూమికతో ఎస్. సి, ఎస్ టి, బి.సి రాజ్యాధికారం కొరకు డా. విశారదన్ మహారాజ్ ఎంతో గాను కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ (బుద్ధారం) గడ్డ పై ఇక రాజకీయ యుద్ధం మొదలైందని వారు అన్నారు. చేరిన వారు పి. శివ, పి. కురుమూర్తి, బి.రవి, జి.అశోక్, పి.బాల రాజ్, పి.కళ్యాణ్, పి.శివకుమార్,రాజు పార్టీలో చేరారు.





## బంధనలకు అతీతంగా ఆర్ఎంపీల వైద్యం..?



- గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై ఆందోళన
- ప్రాథమిక చికిత్సకే పరిమితం కావాల్సిన ఆర్ఎంపీలు..
- అర్హతలకు మించి వైద్య సేవలు అందిస్తున్నారన్న ఆరోపణలు
- అక్రమ క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**షాబాద్, జూలై 16(ప్రజాక్షేత్రం):**

షాబాద్ మండలంలో కొంతమంది ఆర్ఎంపీలు (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు) నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రాథమిక చికిత్సకు మాత్రమే పరిమితమవాల్సిన కొందరు ఆర్ఎంపీలు తమ క్లినిక్‌లలో సెలైన్లు ఎక్కించడం, ఇంజెక్షన్లు చేయడం, అధిక మోతాదులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వినియోగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు నిబంధనలకు అతీతంగా వైద్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణ జ్వరం, జలుబు వంటి సమస్యలతో వచ్చే రోగులకు కూడా సరైన వైద్య పరీక్షలు నిర్వహించకుండా మందులు ఇవ్వడం వల్ల ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని వారు చెబుతున్నారు. అలాగే, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు అవసరమైన పరీక్షలు లేకుండానే మందులు సూచించడం ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి వైద్యం వల్ల రోగుల ఆరోగ్యం దీర్ఘకాలంలో దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని వారు పేర్కొంటున్నారు.

మరోవైపు, కొందరు ఆర్ఎంపీలు ప్రైవేట్ ఆస్పత్రులతో కుమ్మక్కై రోగులను కమీషన్ల కోసం నిర్దిష్ట ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో పేద కుటుంబాలు భారీ వైద్య ఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో షాబాద్ మండలంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, గ్రామీణ ప్రజల ప్రాణాలను కాపాడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## రైతు సహకార సంఘాల ఎన్నికల నుంచి పారిపోతున్న కాంగ్రెస్ – అడ్డదారుల్లో పదవుల పంపకం ప్రజాస్వామ్య హత్యే!



- ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేకే రైతుల ఓటు చోరీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నామినేషన్ల నాటకం
- బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లంపేట్ గౌరారం జగన్ గౌడ్

**(ప్రజా క్షేత్రం)మేడ్చల్:**

తెలంగాణ రాష్ట్రంలో రైతు సహకార సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికలను పక్కనపెట్టి అడ్డదారుల్లో డైరెక్టర్లు, చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లను నియమించడం అత్యంత దుర్మార్గమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని బీజేపీ జిల్లా పార్టీ తీవ్రంగా ఖండించారు.రైతుల ఓటుతో నాయకులను ఎన్నుకునే అవకాశాన్ని హరించి, అధికారాన్ని అడ్డంపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పదవులు కట్టబెట్టడం సిగ్గుచేటని అన్నారు. ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేక, ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నామినేషన్ల పేరుతో పదవుల పంపకానికి తెరలేపిందని విమర్శించారు.

రైతు సహకార సంఘాలు కాంగ్రెస్ పార్టీ రాజకీయ పునరావాస కేంద్రాలు కావని, అవి రైతుల సంస్థలని గుర్తుంచుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్న ఈ ప్రభుత్వానికి రైతాంగం తగిన గుణపాఠం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు.

వెంటనే ఈ అక్రమ నియామకాలను రద్దు చేసి, రాష్ట్రంలోని అన్ని రైతు సహకార సంఘాలకు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

రైతులు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలు, తెలంగాణ సబ్బండ వర్గాల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం రోజురోజుకూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో తన పతనాన్ని తానే వేగవంతం చేసుకుంటోందని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలే గట్టి తీర్పు ఇవ్వడం ఖాయమన్నారు.

# పాలకులారా... గుండె మీద చెయ్యి వేసుకుని ఆలోచించండి...?

- **అక్షరం అమ్మకానికి... నలిగిపోతున్న నవతరం..!**





భారతదేశ విద్యావ్యవస్థ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా ఒక చీకటి అధ్యాయం లిఖించబడుతోంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల కలలను, రాత్రింబవళ్లు పడిన శ్రమను కాసుల కక్కుర్తికి, అవినీతికి బలిపెడుతున్న తీరు హృదయవిదారకం. మే 3న జరిగిన నీట్ (NEETUG 2026) పరీక్షాపత్రాలు లీకైపోవడం, ఆ వివాదం ముదిరి 22 లక్షల మందికి పైగా విద్యార్థులు రాసిన ఈ దేశంలోనే అతిపెద్ద ప్రవేశ పరీక్షను జాతీయ పరీక్షల సంస్థ (NTA) రద్దు చేసి, మళ్లీ 'రీఎగ్జామ్' నిర్వహించాల్సి రావడం మన వ్యవస్థల దిగజారుడుతనానికి పరాకాష్ట. ఒక పరీక్షను పారదర్శకంగా నిర్వహించలేని చేతకానితనం పాలకులదే.. అయితే.. దానికి మూల్యం చెల్లిస్తూ, మానసిక క్షోభను భరించలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటం ఈ దేశ సామూహిక మనస్సాక్షికి తగిలిన పెద్ద గాయం.

ఇంతటి ఘోరకలి దేశంలో జరుగుతుంటే, కేంద్రలో అధికార పీఠంలో ఉన్న నాయకులు, వారి అనుకూల వర్గాలు దీనిని కేవలం "ప్రతిపక్షాల రాజకీయ స్టంట్" అని కొట్టిపారేయడం వారి అహంకారానికి, బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. పాలకులారా, ఒక్కసారి గుండె మీద చేయి వేసుకుని ఆలోచించండి! ఒక పరీక్ష కోసం ఏళ్ల తరబడి కంటిమీద కునుకు లేకుండా, తల్లిదండ్రులు తమ రక్తాన్ని కూడబెట్టిన సొమ్మును కోచింగ్ సెంటర్లకు ధారపోసి చదివిన సగటు విద్యార్థి ఆవేదన మీకు 'స్టంట్' లా కనిపిస్తోందా? కన్నీరు మున్నీరవుతూ జంతర్ మంతర్ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న నవతరం నిరసన మీకు రాజకీయ క్రీడలా తోస్తోందా? ఇది ఏ ఒక్క పార్టీకో, సిద్ధాంతానికో సంబంధించిన అంశం కాదు; ఈ దేశ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత తీవ్రమైన సంక్షోభం.

ఈ అణచివేత, అవహేళనల నుంచే దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని ఒక అపూర్వ డిజిటల్ విప్లవం పుట్టుకొచ్చింది. హక్కుల కోసం పోరాడే గొంతుకలను చీకటి గదుల్లో అహంకార పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఒక సమాంతర సామాజిక శక్తి. కేవలం వారం రోజుల్లోనే రెండు వందల మిలియన్లు (22 కోట్లు) పైగా యువత ఈ వేదికపై ఏకమై, అధికార పీఠాల పునాదులను కదిలించింది.

ఈ అపూర్వ సంఘటనతో ఉలిక్కిపడ్డ కేంద్ర ప్రభుత్వం తన పాత అణచివేత ధోరణినే నమ్ముకుంది. CJP సోషల్ మీడియా ఖాతాలను, గొంతుకలను దేశవ్యాప్తంగా నిషేధిస్తూ ఉక్కుపాదం మోపింది. అయితే, సాంకేతికతను బంధించినంత మాత్రాన అక్షరాల్లోని ఆవేదనను, ఆకలిని ఆపగలరా? సోషల్ మీడియాపై నిషేధాలు విధించగానే ఈ ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి నేరుగా ఢిల్లీ వీధుల్లోకి చేరింది. చలిని, ఎండను లెక్కచేయకుండా వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ ధర్నా వేదికగా ప్రత్యక్ష పోరాటానికి దిగారు. లీకుల మాఫియా అంతం కావాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని వారు చేస్తున్న డిమాండ్లకు ప్రముఖ పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ వంటి లబ్దప్రతిష్టులైన మేధావులు మద్దతుగా నిలవడం ఈ నిరసనలోని నైతిక బలాన్ని చాటుతోంది.

సమాజంలో జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎండగట్టి, విద్యార్థుల పక్షాన నిలబడాల్సిన ఫోర్త్ ఎస్టేట్——మన ముఖ్యాంశ మీడియా ——నేడు పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారి, నిస్సిగ్గుగా ఈ తిరుగుబాటును కించపరుస్తోంది. కానీ సత్యం ఎప్పుడూ దాగదు! సదరు CJP అకౌంట్ యొక్క అసలైన ఇన్‌స్టాగ్రామ్ అనలిటిక్స్ పరిశీలిస్తే, ఆ అకౌంట్‌ను ఫాలో అవుతున్న వారిలో 94.7% మంది స్వచ్ఛమైన భారతదేశ పౌరులే అని తేటతెల్లమైంది.

ఇక్కడ దేశ ప్రజలంతా గమనించాల్సిన ఒక ప్రాథమిక సత్యం ఉంది. న్యాయం కోసం, ధర్మం కోసం జరిగే పోరాటంలో నిలబడేది ఎంతమంది అన్నది ముఖ్యం కాదు; అక్కడ నిలబడింది న్యాయమా కాదా అన్నదే ముఖ్యం! ఒక మహోన్నత ఆశయం కోసం జరిగే నిరసనలోకి ఒక్కరు వచ్చినా అది ధర్మమే అవుతుంది కానీ, దానిని లెక్కలతో తక్కువ చేసి చూపడం ఏ రకమైన జర్నలిజం? ఈ రకమైన అబద్ధాల, వక్రీకరణల వార్తల వల్ల ఎవరికి లాభం చేకూరుతోంది? ఖచ్చితంగా విద్యార్థులకు కాదు, వారి భవిష్యత్తును అమ్మేసుకున్న లీకుల మాఫియాకు, వారిని వెనకేసుకొస్తున్న పాలకులకే ఈ మీడియా సంస్థలు లాభం చేకూరుస్తున్నాయి. సత్యం వైపు నిలబడాల్సిన కలం, కాసులకు దాసోహమై పాలకుల భజన చేయడం ప్రజాస్వామ్యానికే ఒక శాపం!

విషాదం ఇక్కడితో ఆగలేదు; పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ సిబిఎస్ఈ (CBSE) 12వ తరగతి మూల్యాంకనంలో జరిగిన అవకతవకలు భయాందోళనలను కలిగిస్తున్నాయి. ఈ ఏడాది ప్రవేశపెట్టిన 'ఆన్‌స్క్రీన్ మార్కింగ్' (OSM) విధానం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడింది. జవాబు పత్రాలు సరిగ్గా స్కాన్ కాకపోవడం, మసకబారిన కాపీలను అప్‌లోడ్ చేయడం, ఒకరి ఓఎంఆర్ షీట్లు మరొకరికి మార్చడం వంటి ఘోర తప్పిదాల వల్ల అర్హులైన విద్యార్థులకు అత్యంత తక్కువ మార్కులు వచ్చాయి. ఈ టెక్నాలజీ టెండర్ ప్రక్రియ వెనుక దాగున్న అవినీతిని జార్ఖండ్‌కు చెందిన ఒక 17 ఏళ్ల విద్యార్థి ఫోరెన్సిక్ విశ్లేషణతో బట్టబయలు చేయడం గమనార్హం. గతంలోనే పలు విద్యాసంస్థల పరీక్షల నిర్వహణలో విఫలమై, బ్లాక్‌లిస్ట్ అంచున ఉన్న 'కోఎమ్ట్ ఎడ్యుటెక్' (Coempt EduTeck) అనే వివాదాస్పద ప్రైవేట్ సంస్థకు నిబంధనలు మార్చి మరీ వందల కోట్ల కాంట్రాక్ట్ కట్టబెట్టడం వెనుక ఉన్న రహస్యమేమిటి?

కేంద్ర ప్రభుత్వం ఈ సత్యాలను అంగీకరించి తప్పులను సరిదిద్దాల్సింది పోయి, కేవలం డిజిటల్ డేటాను ప్రభుత్వ సర్వర్లకు మార్చడం, కంటితుడుపు జరిమానాలు విధించడం వంటి చర్యలతో చేతులు దులుపుకుంటోంది. గతంలో జరిగిన అనేక బోర్డు పేపర్ లీకులు, ప్రస్తుత నీట్, సిబిఎస్ఈ సంక్షోభాలు విద్యాశాఖ పతనానికి ప్రత్యేక్షసాక్ష్యాలు. ఒకవైపు లీకుల మాఫియా దేశాన్ని గుల్ల చేస్తుంటే, బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయక పోగా, ప్రశ్నించిన యువతపై సోషల్ మీడియా నిషేధాలు విధించడం ఎంతవరకు న్యాయం? ఈ దేశాన్ని నిర్మించే మేధో సంపత్తిని ఇలా బజారున పడేస్తే రేపు దేశానికి వైద్యులు, శాస్త్రవేత్తలు ఎక్కడి నుంచి వస్తారు?

ఈ లీకుల మాఫియా, వ్యవస్థల వైఫల్యం దేశవ్యాప్తంగా తెచ్చిపెట్టిన మానసిక సంక్షోభం మాటలకు అందనంత భయానకమైనది. ఒక గదికే పరిమితమై, సుదూర స్వప్నాల్ని గుండెల్లో దాచుకుని, పగలు రాత్రి తేడా లేకుండా పుస్తకాలతో కుస్తీ పట్టి... నేడు నిలువునా కుప్పకూలిపోతున్నారు. పట్టుమని ఇరవై ఏళ్లు కూడా నిండని వయసులో, వ్యవస్థలు చేసిన పాపానికి తమను తాము దోషులుగా భావిస్తూ పిట్టల్లా రాలిపోతున్నారు. దేశవ్యాప్తంగా నీట్ అభ్యర్థుల బలవన్మరణాల వార్తలు వింటుంటే ఏ తల్లీ కడుపు కోత తట్టుకోగలదు? ఒక్కొక్క బిడ్డను పెంచి పెద్దచేసి, దేశాన్ని రక్షించే వైద్యులు అవుతారని ఆశపడ్డ ఆ కన్నప్రేమకు.. నేడు మిగిలింది కేవలం శవాల దిబ్బేనా? లీక్ అయిన ప్రతి పేపరు వెనుకా.. ఒక నిరుపేద విద్యార్థి ప్రాణం, ఒక మధ్యతరగతి కుటుంబం యొక్క జీవన ఆశ లీక్ అయిపోతున్నాయి. ఈ ఆత్మహత్యలు కేవలం ఆత్మహత్యలు కావు, అవి ఈ స్వార్థపూరిత, అవినీతి విద్యావ్యవస్థ చేసిన నిలువునా హత్యలు! విద్యార్థులు మానసిక క్షోభతో నలిగిపోతుంటే, తల్లుల కడుపుకోత దేశ రాజధానిని తాకుతుంటే ఇంకా స్పందించని ఈ రాతి హృదయాల పాలన ఎవరి కోసం?

ఇది కేవలం పేపర్ లీక్ కాదు, ఈ దేశ భవిష్యత్తు లీక్. కార్పొరేట్ శక్తులకు, అవినీతి కాంట్రాక్టర్లకు విద్యావ్యవస్థను తాకట్టు పెట్టే ఈ ద్రావక విధానాలు మారాలి. అబద్ధపు ప్రచారాలతో, 'పొలిటికల్ స్టంట్లు' అనే నెపాలతో, గోబెల్స్ తరహా మీడియా ప్రచారాలతో నిజాన్ని సమాధి చేయాలనుకుంటే నవతరం ఊరుకోదు.

ఇకనైనా పాలకపక్షం తన రాజకీయ కళ్లద్దాలను పక్కనపెట్టి, నిగూఢంగా ఉన్న ఈ వ్యవస్థాగత అవినీతిని అంగీకరించాలి. ఈ పెను తిరుగుబాటును 'స్టంట్' అని కొట్టిపారేసే అహంకారాన్ని వీడాలి. అదే సమయంలో, ఈ దేశంలోని ద్వంద్వ ప్రమాణాలను చూస్తుంటే అసహ్యం వేస్తోంది. ఒక నిరుపేద విద్యార్థి ట్రాఫిక్ జామ్ వల్లో, బస్సు దొరకకో కేవలం ఒక్క నిమిషం ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి వస్తే.. నిబంధనల పేరుతో లోపలికి రానివ్వకుండా గేట్లు మూసేసి, వారి కన్నీళ్లను కూడా చూడకుండా కఠినంగా వ్యవహరిస్తారు. ఆ ఒక్క నిమిషం ఆలస్యానికి ఆ విద్యార్థి చదివిన చదువు, పడిన కష్టం, ఒక అమూల్యమైన విద్యా సంవత్సరం నిలువునా బూడిదైపోతుంది. ఒక నిమిషం ఆలస్యాన్ని క్షమించని ఈ నిరంకుశ విద్యావ్యవస్థ.. మరి లక్షలాది మంది జీవితాలను బుగ్గిపాలు చేస్తూ ఇంతటి భారీ పేపర్ లీక్ కుంభకోణానికి పాల్పడితే ఎందుకు నోరు మెదపడం లేదు? ఇంత పెద్ద తప్పు జరిగినా, ఇంతమంది విద్యార్థులు రోడ్లెక్కినా, వ్యవస్థలన్నీ కుప్పకూలుతున్నా ఇంకా ఎందుకు 'సప్పుడు' లేకుండా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారు?

అంతకన్నా దారుణం ఏంటంటే.. సమాజంలో చిన్న చిన్న విషయాలకే ట్వీట్లు చేస్తూ, మైకులు పట్టుకుని నీతులు చెప్పే మన సినిమా నటులు, క్రికెటర్లు, పేరు మోసిన మేధావులు, సామాజిక సేవకులు నేడు నిస్సిగ్గుగా మౌన వ్రతం పూనారు. సినిమా ప్రమోషన్లకో, బ్రాండ్ ఎండార్స్‌మెంట్లకో గొంతు చించుకునే ఈ సెలబ్రిటీలకు.. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులు నడిరోడ్డుపై ఏడుస్తుంటే గళం విప్పడానికి నోరు రావడం లేదా? కోట్ల మంది అభిమానించే ఈ తారలు, క్రీడాకారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పాలకులకు భయపడి దాక్కుంటున్నారా? మీరంతా ఇప్పటికైనా నోరు విప్పాలి, విద్యార్థుల పక్షాన నిలబడి గళమెత్తాలి. కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని, దాంతో పాటు విద్యావ్యవస్థను మూలాల నుండి పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేయాలి.

'ఇకనైనా నవతరం నినదించాలి! నిద్రావస్థలో ఉన్న ఈ యావత్ దేశాన్ని మేల్కొలిపే బాధ్యతను యువత తమ భుజాలకెత్తుకోవాలి. ఓ విద్యార్థి లోకమా.. నీ నిశ్శబ్దం అన్యాయం చేసేవాడికి బలమవుతుంది, నీ మౌనం వ్యవస్థల అవినీతికి ఆయుధమవుతుంది. ప్రశ్నించడం నీ హక్కు, నీ భవిష్యత్తును కాపాడుకోవడం నీ బాధ్యత. కుల మతాల, రాజకీయాల సరిహద్దులను బద్దలు కొట్టి, ఒకే ఒక్క తాటిపైకి వచ్చి ఈ దోపిడీ వ్యవస్థలపై సమరశంఖం పూరించాలి. నిరసన జ్వాలలు కేవలం ఢిల్లీ వీధుల్లోనే కాదు, దేశంలోని ప్రతి పల్లె, ప్రతి నగరం నుండి ఎగసిపడాలి. అక్షరాన్ని కాపాడుకునే ఈ మహా సంగ్రామంలో ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిగా మారాలి. పాలకుల అణచివేతకు భయపడకుండా, పక్షపాత మీడియా వక్రీకరణలకు లొంగకుండా సత్యం , న్యాయం వైపు అడుగులు వేయాలి. మార్పు అనేది ఒకరి ఇస్తే వచ్చే భిక్ష కాదు.. పోరాడి సాధించుకునే హక్కు అని నిరూపించే సమయం ఆసన్నమైందని శ్రీకాంత్ అనే మేధావి చెప్పుకొచ్చాడు.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
7901503777

## నూతన కమిటీ అధ్యక్షుడు కుడిక్యాల రాములకు ఘన సన్మానం

**గజ్వేల్ జూలై 16 (ప్రజా క్షేత్రం):-**

గజ్వేల్ నియోజకవర్గ నూతన కమిటీ అధ్యక్షుడు కుడిక్యాల రాములు, అలాగే కార్యవర్గ సభ్యుడు నాగులపల్లి పవన్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్గల్ గ్రామ సీనియర్ నాయకులు దిండి నాగరాజుగౌడ్, ఏశ్వంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నూక బద్రీనాథ్, బబ్బురి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



## అక్రిడిటేషన్ మీడియాకు పోలీసు శాఖ ప్రెస్ స్టిక్కర్లు

**ఒంగోలు, జూలై 16(ప్రజా క్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన అక్రిడిటేషన్ కలిగిన మీడియా ప్రతినిధులకు పోలీసు శాఖ తరపున క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రెస్ స్టిక్కర్లు జారీ చేయనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు తెలిపారు.

స్టిక్కర్ల కోసం మీడియా ప్రతినిధులు అక్రిడిటేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు కారు లేదా ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ల వివరాలను సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను వ్యక్తిగతంగా కాకుండా ఆయా మీడియా సంస్థల బ్యూరో ఇన్‌చార్జీల ద్వారా పంపించాలని కోరారు.

ఈ నెల 18వ తేదీలోగా వివరాలు అందజేసిన వారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రెస్ స్టిక్కర్లు అందజేస్తామని ఎస్పీ తెలిపారు. అవసరమైన పత్రాలను వెంకటేశ్వర్లుకు అందజేయాలని సూచించారు.



# నన్ను ఫొటోలు తీయకండి



బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె (Mouni Roy) వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు.

“నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా” అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు.

ప్రస్తుతం మౌనీ రాయ్ ‘విశ్వంభర’లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న ‘ది వైవ్స్’ చిత్రంలో నటిస్తున్నారు.

# ఆ ఒత్తిడిని పక్కన పెట్టేయండి

“మీ గురించి విమర్శకులు ఏమనుకున్నా పర్వాలేదు కానీ మీకు మీరు నిజాయతీగా ఉండండ”ని అంటోంది కథానాయిక ప్రియాంక చోప్రా. ఓ సందర్భంలో ప్రతికూల వ్యక్తుల పట్ల మనం ఎలాంటి వైఖరిని అలవర్చుకోవాలో, వారి మాటల్ని ఎలా ఎదుర్కోవాలో కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుందామె. “నేను నటించే పాత్రల్లో కాకుండా.. నన్ను నన్నుగా చూడాలని ప్రేక్షకుల నుంచి ఎలాంటి అంచనాలు పెట్టుకోను. అలాంటి అంచనాలు కేవలం నా ప్రియమైన వారిపైనే ఉంటాయి. ఎవరైనా మిమ్మల్ని పనికిరానివారని అంటే.. మీరు నిజంగానే పనికిరానివారైపోతారా? కాదు కదా. కాబట్టి, విమర్శించేవారు ఏమనుకున్నా.. ఏమన్నా సరే పట్టించుకోకండి. మీ కుటుంబం, అభిమానుల పట్ల నిజాయతీగా ఉండండి. మిమ్మల్ని ప్రేమించే వారి పట్ల నిజాయతీగా ఉంటూ మీ శక్తి మేరకు ఉత్తమంగా ఉండడానికి ప్రయత్నించండి. అదే చాలు. అందరినీ మెప్పించాలనే ఒత్తిడిని పక్కన పెట్టేయండి. అప్పుడు జీవితం బాగుంటుంద”ని చెప్పింది. ‘వారణాసి’ గురించి చెప్తూ.. ‘ఈ సినిమా కోసం నేను 14నెలలుగా పనిచేస్తున్నా. ఈ చిత్రంలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేశాను. ప్రస్తుతానికి ఇంతకంటే ఎక్కువ చెప్పలేన’ని అంది ప్రియాంక.





# సినిమా ఖరారైనట్టేనా

చాలా రోజులుగా అల్లు అర్జున్ - బసిల్ జోసెఫ్ కలయికలో సినిమా ప్రచారంలో ఉంది. ఈ ఇద్దరూ కలిసి సినిమా చేస్తున్నారనే సంగతి ‘పుష్ప 2’ విడుదలైన దగ్గర్నుంచీ వినిపిస్తోంది. మధ్యలో ఒక దఫా కథాచర్చలు కూడా జరిగాయి. కానీ ఆ వెంటనే అల్లు అర్జున్... అట్లీ దర్శకత్వంలో ‘రాకా’ కోసం రంగంలోకి దిగారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోనూ మరో సినిమాకి పచ్చజెండా ఊపారు. దాంతో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్‌తో అల్లు అర్జున్ సినిమా ఉంటుందో లేదో అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఇప్పుడు మళ్లీ ఆ కలయికపై చర్చ ఊపందుకుంది. అందుకు కారణం దర్శకుడు బసిల్ జోసెఫ్ ఇన్‌స్టాలో పంచుకున్న ఓ పోస్ట్. అది చూసినప్పట్నుంచి ఈ కలయికలో సినిమా ఖరారైనట్టే అని, త్వరలోనే అందుకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలూ ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఐకాన్ అని రాసి ఉన్న టోపీతోపాటు, అల్లు అర్జున్ సినిమాలోని రింగ... రింగ పాటని ఆ పోస్ట్‌లో పంచుకున్నారు బసిల్ జోసెఫ్. ఆ పోస్ట్‌ని పంచుకున్న వెంటనే ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. అల్లు అర్జున్ ఐకాన్‌స్టార్‌గా ప్రాచుర్యం పొందిన సంగతి తెలిసిందే. ఆయనతో సినిమా ఖరారు కావడంతోనే దర్శకుడు బసిల్ జోసెఫ్ ఈ పోస్ట్‌ని పంచుకున్నారనేది పరిశ్రమ వర్గాల నమ్మకం. బసిల్ నటుడిగా రాణించడంతోపాటు... మలయాళంలో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించి ప్రతిభని చాటారు. అందులో ‘మిన్నల్ మురళి’ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఆదరణ పొందింది. దాంతో అల్లు అర్జున్ - బసిల్ కలయికలో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# జననాయగన్ వచ్చేస్తున్నాడు



తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఆఖరి చిత్రం ‘జన నాయగన్’. ఈ ఏడాది సంక్రాంతికే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ చిత్రాన్ని ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ మేరకు ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. ‘అగ్ని పరీక్షలో నిలిచి.. కాలం మలిచిన రూపం.. పోరాటం ఎంత కఠినంగా ఉంటే.. విజయం అంత ఘనంగా ఉంటుంది’ అనే వ్యాఖ్యల్ని జోడించింది. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలకపాత్రలో నటించింది.

# భారీ ధరకు అమ్ముడుపోయిన ‘వృషకర్మ’ నాన్-థియేట్రికల్ రైట్స్!

అక్కినేని నాగచైతన్య హీరోగా నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ మూవీ ‘వృషకర్మ’. ఈ సినిమా విడుదల కాకముందే బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తూ ఇండస్ట్రీ వర్గాల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించిన నాన్-థియేట్రికల్ డీల్స్ చాలా భారీ రేటుకు క్లోజ్ అయినట్లు ఫిల్మ్ నగర్లో గట్టిగా టాక్ వినిపిస్తోంది. ప్రముఖ ఓటీటీ, శాటిలైట్ సంస్థ అయిన జీ ఛానెల్ ఈ సినిమా నాన్-థియేట్రికల్ రైట్స్‌ను దాదాపు రూ. 50 కోట్లకు సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. రూ. 50 కోట్ల భారీ డీల్ కుదరడంతో, ఈ సినిమా బడ్జెట్‌లో సగానికి పైగా అమౌంట్ కేవలం ఈ ఒక్క రైట్స్ ద్వారానే రికవరీ అయిపోయిందని అంచనా వేస్తున్నారు.

దీనికి తోడు మ్యూజిక్ రైట్స్, అలాగే హిందీ డబ్బింగ్ శాటిలైట్ రైట్స్ కూడా కలిపితే సినిమా బడ్జెట్‌లో మెజారిటీ భాగం ప్రీ-రిలీజ్ బిజినెస్ ద్వారానే వెనక్కి వచ్చేస్తుందని సమాచారం. నిర్మాతలకు ఇది చాలా సేఫ్ ప్రాజెక్ట్‌గా మారబోతోందని టాక్. నాగచైతన్య కెరీర్‌లోనే ఇది వన్ ఆఫ్ ది బెస్ట్ ప్రీ-రిలీజ్ బిజినెస్ రికార్డ్ అని చెప్పవచ్చు. ఇక సినిమా విషయానికి వస్తే.. ‘విరూపాక్ష’ వంటి సూపర్ హిట్ చిత్రంతో మెప్పించిన టాలెంటెడ్ డైరెక్టర్ కార్తీక్ దండు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైథలాజికల్ మిస్టరీ థ్రిల్లర్ జోనర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలో నాగచైతన్య సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. కార్తీక్ దండు మార్క్ సస్పెన్స్ ఎలిమెంట్స్, మిస్టికల్ థ్రిల్లర్ కాన్సెప్ట్ ఈ సినిమాపై అంచనాలను భారీగా పెంచేస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీని డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



# ఇప్పటికీ 'బేబీ' సినిమా డబ్బులు నాకు రాలేదు..



టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బవరం తాజాగా 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో హీరోగా నటించారు. ఈ చిత్రంలో శ్రీ గౌరీ ప్రియ కథానాయికగా నటించగా, రవి నంబూరి దర్శకత్వం వహించారు. సాయి రాజేష్, ఎస్‌కేఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా జూలై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో నిన్న చిత్రబృందం మీడియాతో సమావేశమైంది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరంను ఉద్దేశించి, "'క' సినిమా భారీ విజయం సాధించినప్పటికీ, ఆ చిత్ర నిర్మాత మాత్రం తమకు పెద్దగా లాభాలు రాలేదని చెప్పారు. దీనిపై మీ స్పందన ఏమిటి?" అని ప్రశ్నించారు. దీనికి కిరణ్ స్పందిస్తూ, "మాది చిన్న సినిమా. మా చిత్రానికి భారీ స్థాయిలో వసూళ్లు వచ్చి ఉండకపోవచ్చు. కానీ సినిమా మాత్రం మంచి విజయం సాధించింది. అలాగే విడుదలకు ముందే డిస్ట్రిబ్యూటర్లకు అమ్మేశాం. సినిమా ఏ స్థాయిలో ఆడింది, ఎంత వసూళ్లు సాధించింది అనే వివరాలు మీ వద్ద కూడా రికార్డుల రూపంలో ఉంటాయి" అని తెలిపారు. అదే సమయంలో నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ... ఒక సినిమా హిట్ అయినంత మాత్రాన నిర్మాతకు భారీ లాభాలు వస్తాయని అనుకోవడం సరైంది కాదు. నేను నిర్మించిన 'బేబీ' సినిమా పెద్ద విజయం సాధించినప్పటికీ ఇప్పటికీ కొంతమంది నుంచి రావాల్సిన డబ్బులు రాలేదు. నిర్మాతలకు వారి సొంత ఇబ్బందులు ఉంటాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కిరణ్ అబ్బవరం, ఎస్‌కేఎన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఆమెతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది..



మలయాళ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయకుడిగా గుర్తింపు పొందిన నటుడు దుల్కర్ సల్మాన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఈయన కేవలం మలయాళ చిత్రాలకే పరిమితం కాకుండా తెలుగు, తమిళం, హిందీ తదితర భాషల్లో నటిస్తూ దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ 'శ్రీ శ్రీ' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా కనిపించనుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల నుంచి విశేష స్పందనను దక్కించుకుంది.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దుల్కర్ సల్మాన్ తనకు అత్యంత ఇష్టమైన నటి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. నాకు అత్యంత ఇష్టమైన నటీమణుల్లో కాజోల్ ఒకరు. తన అద్భుతమైన నటనతో ఎన్నో పాత్రలకు ప్రాణం పోశారు. ఎన్నో సంవత్సరాల పాటు స్టార్ హీరోయిన్‌గా కొనసాగి, ఇప్పటికీ అదే స్థాయిలో తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఎంతోమంది నటీమణులకు ఆమె ఆదర్శంగా నిలిచారు. అందుకే ఆమెంటే నాకు ఎంతో అభిమానం. ఆమెతో కలిసి నటించే అవకాశం వస్తే ఎంతో ఆనందంగా స్వీకరిస్తానని తెలిపారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394